సనాతనం.... సాధు, సంతుల స్వాగతం

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇటీవల ప్రకటించిన సనాతన ధర్మపరిషత్‌ను సాధు, సంతులు స్వాగతించారు. తిరుపతిలో శనివారం జరిగిన జాతీయ హిందూ ధార్మిక సదస్సులో ఆరు రాష్ట్రాలకు చెందిన వందలాదిమంది సాధువులు, మఠాధిపతులు, హిందూ ధార్మిక సంస్థల సభ్యులు, తిరుక్షేత్రాల రక్షణ సమితి సభ్యులు పాల్గొన్నారు.

- 8లో



విహంగ గానం

వాన కురిస్తే ప్రకృతి పరవశిస్తుంది. చెట్టూ పుట్టా పిట్టా పురుగూ.. సమస్తమూ సంతోషంతో కళకళలాడుతాయి. తడిచిన రెక్కలు ఆరబెట్టుకుంటూ, ఊసులు చెప్పుకుంటూ, గూళ్లు అల్లుకుంటూ.. ఈ అందాల రెక్కల లోకాన్ని మీరూ ఆస్వాదించండి..

- 8లో



కార్తీక్ మ్యాజిక్

తిరుపతిలోని ఎస్వీయూ స్టేడియంలో యువ గాయకుడు కార్తీక్ మ్యూజిక్ షో యువతను ఉర్రూతలూగించింది. భారీసంఖ్యలో హాజరైన యువతీయువకుల ఈలలు, చప్పట్లతో స్టేడియం మార్మోగింది.

- 8లో



ఉల్లం'ఘనుల'పై కొరడా

- 327మంది మైనింగ్ డీలర్లపై అభియోగాల నమోదు.. 72మందికి క్లీన్ చిట్
- నివేదికలు సిద్ధం చేసిన అధికారులు



మైకా క్వార్ట్జ్ గ్రేడింగ్



జగన్ జమానాలో అనధికారికంగా తనిఖీ చేస్తున్న సిబ్బంది(ఫైల్‌ఫొటో)

గూడూరు(అర్బన్), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో విచ్చలవిడిగా రెచ్చిపోయిన సిలికాసురులు, గనులు మింగిన వారిపై కొరడా ఝుళిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా భూగర్భ గనుల శాఖ అధికారులు వారం రోజులుగా అక్రమార్కుల చిట్టాను తయారు చేయడంలో తలమునకలై ఉన్నారు. ముందుగా ఎం.డి.ఎల్(మైనింగ్ డీలర్స్ లైసెన్స్) అక్రమాలపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. అనుమతుల్లేని చోట్ల అక్రమంగా ఖనిజాల సేకరణ, ప్రభుత్వ రాయల్టీకి మించి కట్టిన 'జేట్యాక్స్'తో పొందిన పర్మిట్లు, లెక్కకు మించిన ఖనిజాల నిల్వలపై లోతుగా అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపారు. 300 సిలికా సాండ్, క్వార్ట్జ్, గ్రావెల్ మైనింగ్ డీలర్లపై శాఖాపరమైన చర్యలు తప్పనిసరిగా తెలుస్తోంది. అలాగే మైనింగ్ లీజులను గలీజుగా మార్చిన మరికొంత మంది గనుల యజమానులపైనా ఉల్లంఘనలను బట్టి చర్యలు తీసుకోనున్నారు. గూడూరు, నాయుడుపేట డివిజన్లలో మొత్తం 399 ఎం.డి.ఎల్‌లకు సిలికా సాండ్, క్వార్ట్జ్, గ్రావెల్ తదితర ఖనిజాల గ్రేడింగ్, రవాణా కోసం భూగర్భ గనుల శాఖ నుంచి అనుమతులున్నాయి. వీటిలో 72 ఎం.డి.ఎల్‌లకు మైనింగ్ అధికారులు క్లీన్‌చిట్ ఇచ్చారు. 327 మంది మైనింగ్ డీలర్లపై వివిధ రకాల అభియోగాలను నమోదు చేసి, ప్రభుత్వానికి పంపారు. వీరిపై తదుపరి చర్యల కోసం అధికారులు వేచి చూస్తున్నారు. క్లీన్‌చిట్ అందుకున్న డీలర్లకు ఖనిజాల రవాణా పర్మిట్లను అందించేందుకు గ్రీన్ సిగ్నల్ లభించింది. నిబంధనలను స్వల్పంగా అతిక్రమించిన వారికి తగిన జరిమానా విధించి ఆపై రవాణా అనుమతులు ఇవ్వనున్నట్లు అధికార వర్గాలు సూత్రప్రాయంగా వెల్లడించాయి. అభియోగాలు తీవ్రంగా ఉన్న డీలర్లపై కఠినంగా వ్యవహరించే అవకాశముంది.

గనుల యజమానులపైనా చర్యలు..

గీత దాటిన మైనింగ్ యజమానులపై చర్యలకు గూడూరు అధికారులు తలమునకలై ఉన్నారు. మైనింగ్ డీలర్లపై చర్యల అనంతరం వారిపై దృష్టి సారించనున్నారు. గూడూరు డివిజన్‌లోని కోట, చిల్లకూరు మండలాల్లో 80 సిలికా గనులు, చిల్లకూరు, గూడూరు రూరల్ మండలాల్లో 15 క్వార్ట్జ్, మైకా(అభ్రకం), ఫెల్స్‌పర్ గనులు 5 వర్మిక్ లైట్ గనుల్లో నుంచి ఖనిజాల వెలికితీతకు ప్రభుత్వ అనుమతులున్నాయి. వైసీపీ అధికారంలో ఉన్న 2019-24 మధ్య కాలంలో, ఎక్కువగా 2023-24కాలంలో వైసీపీ నాయకుల అండతో అనుమతులు ఉన్న గనులతో పాటు, ప్రభుత్వ ప్రైవేటు భూముల్లో ఇష్టారాజ్యంగా అక్రమాలు చోటుచేసుకున్నాయి. ప్రభుత్వ అనుమతులు ఉన్న గనుల నుంచి పర్మిట్లను డ్రా చేసి అక్రమ రవాణాకు ఉపయోగించినట్లు మైనింగ్ అధికారులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. దీనిపై సమగ్ర విచారణ కొనసాగుతోంది. రెండు మూడు రోజుల్లో పూర్తి నివేదికలను ప్రభుత్వానికి పంపనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

నివేదికలు సిద్ధం

గూడూరు డివిజనల్ భూగర్భగనులశాఖ పరిధిలోని 14 మండలాల్లో ప్రధానంగా కోట, చిల్లకూరు, గూడూరు రూరల్ మండలాల్లో 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన మైనింగ్ అక్రమాలపై నివేదికలు దాదాపు సిద్ధం చేసినట్లు డివిజనల్ భూగర్భ, గనుల శాఖ అధికారి కె.శ్రీనివాసరావు వెల్లడించారు. ఎండీఎల్‌లో జరిగిన అక్రమాలపై విచారణ పూర్తి కాగా మైనింగ్ లీజుల్లో జరిగిన ఉల్లంఘనలపై సోమవారం కల్లా నివేదికలను సిద్ధం చేయనున్నట్లు చెప్పారు. గత ఆర్థిక సంవత్సరంలో మైనింగ్ ద్వారా తమ డివిజన్‌లో ప్రభుత్వానికి రూ.77కోట్లు ఆదాయం సమకూరినట్లు తెలిపారు.

తిరుపతిలో హోటళ్లకు మళ్లీ బాంబు బెదిరింపు

- డాగ్, బాంబు స్క్వాడ్‌ల తనిఖీలు
- నకిలీ మెయిల్స్ అని తేల్చిన పోలీసులు




హోటళ్లలో తనిఖీలు చేస్తున్న బాంబు, డాగ్ స్క్వాడ్ పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని పలు హోటళ్లకు శనివారం మళ్లీ బాంబు బెదిరింపులు వచ్చాయి. కపిలతీర్థం సమీపంలోని రాజ్ పార్కు హోటల్ మేనేజర్ సుశాయ్‌కు తెల్లవారుజామున 5.32 గంటలకు బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. ఆయన అలిపిరి సీఐ రాంకిషోర్‌కు సమాచారం అందించారు. అదే ప్రాంతంలోని మరో రెండు, ఈస్ట్ స్టేషన్ పరిధిలో ఒకటి, రూరల్ పరిధిలోని తాజ్ హోటల్‌కూ బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. డీఎస్పీ వెంకటనారాయణ ఆధ్వర్యంలో బాంబు డిస్పోజల్, డాగ్ స్క్వాడ్‌లు వెంటనే హోటల్స్ వద్దకు చేరుకున్నాయి. రాజ్ పార్కు హోటల్ వెలుపల పార్క్ చేసి ఉంచిన జమ్మూకాశ్మీర్ రిజిస్ట్రేషన్ కారును తనిఖీ చేశారు. అలాగే రష్యన్లు, మలేషియా వాసులు బసచేసే గదులపై ప్రత్యేక దృష్టి సారించి అడుగడుగునా తనిఖీలు చేసి, ఎలాంటి బాంబులూ లేవని తేల్చారు. మిగిలిన హోటళ్లనూ తనిఖీ చేసి ఫేక్ మెయిల్స్ అని నిర్ధారించుకున్నారు. రెండు రోజుల వ్యవధిలో రెండు సార్లు నాలుగు హోటళ్లకు, తిరుపతి విమానాశ్రయంలో స్టార్ ఎయిర్ లైన్స్ విమానానికి బాంబు బెదిరింపు మెయిల్స్ రావడంతో జిల్లా పోలీసు యంత్రాంగం హైఅలర్ట్ ప్రకటించింది.

ఫేక్ మెయిల్స్‌పై లోతైన దర్యాప్తు : ఎస్పీ

తిరుపతిలోని పలు హోటళ్లకు ఫేక్ మెయిల్స్ రావడం పట్ల లోతైన దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. ఆయా హోటళ్ల మేనేజర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బీఎన్ఎస్ చట్టం 353 క్లాస్ వన్, క్లాస్ బీ, 351 క్లాస్ 4 కింద ఆరు కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. బాంబు బెదిరింపుల వెనుక పాక్ తీవ్రవాదుల హస్తముందా? లేకుంటే వారి పేర్లతో ఫేక్ మెయిల్స్ పెట్టి భక్తులను భయాందోళనకు గురిచేస్తున్నారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. మెయిల్స్ వచ్చిన ఐడీలు, ఫోన్ నంబర్ల ఆధారంగా నిందితులను గుర్తించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ విషయంలో నగర ప్రజలు భయడాల్సిన పనిలేదని, అనుమానితులు కనిపిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని కోరారు.



తిరుపతిలో సభ్యత్వ నమోదు ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, నరసింహయాదవ్

టీడీపీ సభ్యత్వ నమోదు షురూ

- పాల్గొన్న ఎమ్మెల్యేలు,పార్టీ నాయకులు

తిరుపతి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అధినేత పిలుపు మేరకు జిల్లావ్యాప్తంగా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం శనివారం ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రారంభమైంది. తిరుపతిలోని పార్టీ పార్లమెంటు కమిటీ కార్యాలయంలో అధ్యక్షుడు నరసింహ యాదవ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన తన సభ్యత్వాన్ని రెన్యువల్ చేసుకున్నారు. తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి జీవకోన ప్రాంతంలోని రాజీవ్‌గాంధీ కాలనీ గంగమ్మ ఆలయం వద్ద సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లా అధ్యక్షుడు నరసింహ యాదవ్‌తో కలసి మాజీ ఎమ్మెల్యే, ఇన్‌చార్జి సుగుణమ్మ ప్రారంభించారు. గూడూరులో తన క్యాంపు కార్యాలయంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ రూ.లక్ష చెల్లించి శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. వెంకటగిరిలో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పార్టీ కార్యాలయంలో సభ్యత్వ నమోదును లాంఛనంగా మొదలుపెట్టారు. సూళ్లూరుపేట నియోజకవర్గానికి సంబంధించి నాయుడుపేటలోని టీడీపీ ఎమ్మెల్యే విజయశ్రీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆరంభించగా మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యంతో పాటు పలువురు ముఖ్య నేతలు పాల్గొన్నారు. చంద్రగిరి నియోజకవర్గానికి సంబంధించి ఎర్రావారిపాలెం మండలం పసుపులేటివారిపల్లిలో ఎమ్మెల్యే పులివర్తి నానీ సభ్యత్వ నమోదుకు శ్రీకారం చుట్టగా ఆయన సతీమణి పులివర్తి సుధారెడ్డి పాకాలలో సభ్యత్వ నమోదును ప్రారంభించారు.వారిద్దరూ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు.శ్రీకాళహస్తి నియోజకవర్గం విషయానికొస్తే శ్రీకాళహస్తి మండలం కమ్మకొత్తూరు, అక్కుర్తి గ్రామాలతో పాటు రేణిగుంటలోనూ ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సభ్యత్వ నమోదు ప్రక్రియను మొదలుపెట్టారు.

నకిలీ సభ్యత్వాలను రద్దు చేయాలి

శ్రీకాళహస్తి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ విధానాన్ని దుర్వినియోగం చేస్తూ కొందరు సృష్టిస్తున్న నకిలీ టీడీపీ సభ్యత్వాలను రద్దు చేయాలని ఆ పార్టీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్ విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో కొందరు వైసీపీ నాయకులు, కార్యకర్తలు గుట్టుచప్పుడు కాకుండా టీడీపీ సభ్యత్వాలు స్వీకరించడంపై ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. గత ఎన్నికల్లో టీడీపీని ఓడించడమే ధ్యేయంగా పనిచేసిన కొందరు ప్రస్తుతం ఆన్‌లైన్‌లో టీడీపీ సభ్యత్వాలను పొందుతున్నారన్నారు. క్షేత్రస్థాయిలో పక్కదారిపడుతున్న టీడీపీ సభ్యత్వాలపై పార్టీ అధిష్ఠానం దృష్టిసారించి నకిలీవి గుర్తించి రద్దు చేయాలని కోరారు.

నగరి, సత్యవేడుల్లో ప్రారంభించిన స్థానిక నేతలు

నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ మంత్రి నారా లోకేశ్‌తో కలసి విదేశీ పర్యటనకు వెళ్లిన నేపథ్యంలో ఆ నియోజకవర్గంలో అన్ని మండలాల్లోనూ మండల స్థాయి నేతలు ఉత్సాహంగా సభ్యత్వ నమోదును ప్రారంభించారు. పుత్తూరు పట్టణంలో పార్టీ సీనియర్ నేత మునివరత్నం నాయుడు, రూరల్ మండలంలో మరో సీనియర్ నేత గంజి మాధవయ్య సభ్యత్వ నమోదుకు శ్రీకారం చుట్టారు. ఇక సత్యవేడు విషయాకొస్తే పార్టీ అధిష్ఠానం సస్పెన్షన్ విధించిన నేపథ్యంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొనలేదు. నియోజకవర్గ సమన్వయకర్త శ్రీపతిబాబు సత్యవేడులో మెంబర్‌షిప్ ఎన్‌రోల్‌మెంట్‌ను ప్రారంభించారు. అలాగే సత్యవేడు మండలం వీఆర్ కండ్రిగ, మదనంబేడు గ్రామాల్లో కూడా పాల్గొన్నారు. కాగా జిల్లావ్యాప్తంగా నియోజకవర్గ కేంద్రాలతో పాటు మండలాల్లో కూడా తొలిరోజు సభ్యత్వ నమోదు కార్యక్రమాలు జోరుగా మొదలయ్యాయి. స్థానిక నేతలు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. మొదటి రోజు కొత్త సభ్యత్వాలు తక్కువగా నమోదు కాగా ఇప్పటికే సభ్యులుగా ఉన్న వారు తమ సభ్యత్వాలను రెన్యువల్ చేసుకోవడం ఎక్కువగా కనిపించింది.



పసుపులేటివారి పల్లెలో సభ్యత్వ నమోదు చేసుకుంటున్న ఎమ్మెల్యే నాని

డీఈవో బాధ్యతల స్వీకరణ

తిరుపతి(విద్య), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి):జిల్లా విద్యాశాఖాధికారిగా కె.వెంకటనాగేంద్ర కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. కార్వేటినగరం డైట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శేఖర్ ఇప్పటివరకు జిల్లా ఇన్‌చార్జి విద్యాశాఖాధికారిగా బాధ్యతలు నిర్వర్తించారు. విద్యాశాఖాధికారుల బదిలీల్లో భాగంగా మదనపల్లి ఉప విద్యాశాఖాధికారిగా నియమితులైన వెంకట నాగేంద్ర కుమార్‌కు తిరుపతి జిల్లా డీఈవోగా పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ మేరకు ఆయన శనివారం కలెక్టరేట్‌లోని డీఈవో కార్యాలయంలో పూర్వ డీఈవో శేఖర్ నుంచి బాధ్యతలు తీసుకున్నారు. నూతన డీఈవోను ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) ఆధ్వర్యంలో సన్మానించి, అభినందనలు తెలియజేశారు.



డీఈవోను సత్కరిస్తున్న అప్సా నాయకులు

డక్కిలిలో రెవెన్యూ రికార్డులు మార్చేశారు

డక్కిలి, అక్టోబరు 26 : (ఆంధ్రజ్యోతి) : డక్కిలి మండల రెవెన్యూ కార్యాలయంలో రికార్డులు గోల్‌మాల్ అయ్యాయని ఏపీ ప్రజా సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ గద్దల మునెయ్య ఆరోపించారు. ఈ మేరకు ఆయన శనివారం తహసీల్దార్ ఎం.శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. 2003 నుంచి 2024 వరకు రెవెన్యూ రికార్డుల మార్పిడిలో గోల్‌మాల్ జరిగిందన్నారు. రైతులకు సంబంధించిన భూముల రికార్డులు మారిపోయినట్లు తెలిపారు. గతంలో ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన రమేష్‌బాబు, తీర్థంపాడు సచివాలయ సెక్రటరీ కార్తీక్, అటెండర్ వనిత భూమాయ చేశారని ఆరోపించారు. దీనిపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

బోగస్ ఎపిక్ కార్డులుంటే వెంటనే వెనక్కివ్వండి

- తిరుపతిలో అక్రమ డౌన్‌లోడింగ్ నిర్ధారణ అయిందన్న కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : బోగస్ ఎపిక్‌కార్డులు తయారు చేసినా లేదా కలిగి ఉన్నా శిక్ష తప్పదని కలెక్టర్ వెంకటేశ్వర్ హెచ్చరించారు. తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 39,251 ఎపిక్ కార్డుల(ఓటరుకార్డులు) డేటాను అనధికారికంగా డౌన్‌లోడ్ చేసినట్లు నిర్ధారణ అయిందని వెల్లడించారు. బోగస్ ఎపిక్‌కార్డుల ద్వారా 2021లో జరిగిన తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికల్లో అక్రమంగా ఓట్లు వేయడానికి ప్రయత్నించారని స్పష్టం చేశారు. దీనిపై ఇప్పటికే పలువురు అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నామని, కేసులు కూడా నమోదు చేశామని తెలిపారు. బోగస్ ఎపిక్‌కార్డులు కలిగి ఉన్న వ్యక్తులు వెంటనే వాటిని తిరుపతి అసెంబ్లీ ఎన్నికల అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్‌కు కానీ, కలెక్టర్ కార్యాలయంలో కాని అప్పజెప్పాలని శనివారం ఒక ప్రకటనలో సూచించారు.

తిరుచ్చిపై కల్యాణ వెంకన్న



చంద్రగిరి, అక్టోబరు 26: శ్రీనివాసమంగాపురంలో శనివారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి భక్తులకు దర్శనమిచ్చారు.ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, రమేష్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, అర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, అర్చకులు బాలాజీరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణాచార్యులు, పార్థసారధి, జమేదార్ చిరంజీవి పాల్గొన్నారు.కాగా కల్యాణ వేంకటేశ్వరస్వామిని శనివారం ఎన్టీఆర్ తనయుడు నందమూరి రామకృష్ణ దర్శించుకున్నారు.



కల్యాణ వెంకన్న ఆలయంలో నందమూరి రామకృష్ణ

టోల్‌ప్లాజా కాఫీ షాపులో బీభత్సం

- మద్యం మత్తులో ఇద్దరిపై దాడి - కేసు నమోదు చేసిన పోలీసులు





దాడిలో గాయపడిన దీపక్ - ధ్వంసమైన షాపు

చంద్రగిరి, అక్టోబరు 26: చంద్రగిరి మండలం, పాకాలవారిపల్లె వద్దవున్న గాదంకి టోల్ ప్లాజా సమీపంలోని తాటిబెల్లం కాఫీ షాపును నలుగురు మద్యం మత్తులో ధ్వంసం చేసి, ఇద్దరిపై దాడి చేశారు.పోలీసుల కథనం మేరకు... శుక్రవారం రాత్రి 12 గంటల సమయంలో పాకాల మండలానికి చెందిన దిలీప్ నాయుడు, మనోజ్, గౌతమ్, దినేష్ మద్యం మత్తులో కాఫీ షాపుకు వచ్చి టీ అడిగారు.టోకెన్ తీసుకోవాలని షాపులో ఉన్న చైతన్య చెప్పడంతో వాగ్వాదం జరిగింది. దీంతో వారు షాపులోని ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. చైతన్య అడ్డుకోవడంతో అతనిపై కూడా దాడి చేశారు.టీ మాస్టర్ దీపక్ వారిని అడ్డుకునే ప్రయత్నం చేయగా, అతడిపై కూడా దాడి చేశారు.చైతన్య, దీపక్‌లను స్థానికులు 108 వాహనంలో చికిత్స నిమిత్తం తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. నిందితులపై పాకాల పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతిపక్షాలపై కక్ష తప్ప అభివృద్ధిలేదు: కాంగ్రెస్



కాంగ్రెస్ నాయకులకు సన్మానం

చంద్రగిరి, అక్టోబరు 26: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతిపక్షాలపై కక్ష సాధింపులే తప్ప అభివృద్ధి జరగడంలేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు భాస్కర్, ఉపాధ్యక్షుడు దొడ్డారెడ్డి రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం చంద్రగిరిలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు అవుతున్నా, ఎన్నికలలో ఇచ్చిన హామీలు ఇంతవరకు నెరవేరలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు డాక్టర్ కేపీఎస్ వాసు, నాయకులు జయచంద్రారెడ్డి, లోకేష్‌రెడ్డి, బాలాజీ రెడ్డి, కాపువీధి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీసీఈలో కృత్రిమమేధపై శిక్షణ



తిరుపతిరూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి):తిరుపతి- కరకంబాడి రోడ్డులోని ఎస్వీకాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో ఏఐసీటీఈ ఆర్థిక సౌజన్యంతో కృత్రిమమేధపై ఆరురోజులపాటు నిర్వహించిన అటల్ ఉపాధ్యాయ శిక్షణా కార్యక్రమం శనివారంతో ముగిసింది. ముఖ్యఅతిథిగా హాజరైన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(వరంగల్) ప్రొఫెసర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ... కృత్రిమమేధ, డేటాసైన్స్, మిషన్ లెర్నింగ్ రంగాలలో మెరుగైన ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, ఈ దిశగా టీచర్లు నైపుణ్యాలను పెంచుకోవాలని తెలిపారు. పరిశోధనకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సుధాకర్‌రెడ్డి, కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్.సురేష్, డాక్టర్ ఎ.గణేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో ఉద్యాన తోటల్లో అధిక దిగుబడి

పాకాల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కూరగాయల సాగులో సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టి నాణ్యమైన అధిక దిగుబడి సాధించాలని ఉద్యాన అధికారిణి శైలజ రైతులకు సూచించారు. పదిపుట్లబైలు గ్రామ పరిసరాలలో శనివారం ఆమె కూరగాయల పంటలను పరిశీలించారు. వంకాయ, బీర, కాకర సాగులో చేపట్టాల్సిన సస్య రక్షణ గురించి రైతులకు వివరించారు. వంకాయ తోటల్లో పూత, కాయ దశలో కాండం తొలిచే పురుగు ఎక్కువగా వున్నట్లు గుర్తించారు. ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించి రైతులు సరైన మందులు పిచికారి చేసి తెగుళ్లను నివారించాలన్నారు. ఆమె వెంట ఉద్యాన సహాయకురాలు వనజ పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు ప్రారంభం

● శాశ్వత సభ్యత్వం తీసుకున్న ఎమ్మెల్యే నాని

ఎర్రావారిపాలెం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని శనివారం ఎర్రావారిపాలెం మండలంలోని నెరబైలు పంచాయతీలో టీడీపీ సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొదటగా తాను లక్ష రూపాయలు చెల్లించి శాశ్వత సభ్యత్వం తీసుకొన్నారు.కార్యకర్తలంతా తమ గ్రామాల పరిధిలో సభ్యులను పార్టీలో చేర్పించాలన్నారు. అనంతరం పల్లె పండుగలో భాగంగా చింతగుంట పంచాయతీలోని పసుపులేటివారిపల్లె , చాదావాండ్ల పల్లెలో డ్రైనేజి కాల్వ పనులకు శిలా ఫలకం ఆవిష్కరించారు.చింతగుంట, నెరబైలు పంచాయతీలకు రూ.2.70 కోట్లతో సీసీ రోడ్లు, మురుగు కాల్వల పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఎంపీడీవో అరుణ, ఎంఈవో బాలసుబ్రమణ్యం, పార్టీ నాయకులు దేశిరెడ్డి రఘునాథ, మహేష్ నాయుడు, కోళ్ల ప్రసాద్, కల్ప రవి, బెంగుళూరి రాజకుమారి, కొమ్మాక లక్ష్మీదేవి, ద్వారకనాథరెడ్డి, ముండ్లపాటి మురళి, నిరంజన్, విశ్వనాథరెడ్డి, శివరామి రెడ్డి, మధుసూదన్, మాజీ జడ్పీటీసీ కుమార్‌స్వామి, కేశవులు నాయుడు, దేవి, అమరనాథ రెడ్డి, చంద్రబాబు నాయుడు, పురుషోత్తమ రెడ్డి, సుధాకర నాయక్, వేణుగోపాల్, సిద్దకుమార్, నాగరాజు, మురళి, హరిశ్చంద్ర, నాగరాజ, విజయారెడ్డి, చిన్నపరెడ్డి, జయపాల్ తదితరులుపాల్గొన్నారు.

శాశ్వత సభ్యత్వం తీసుకున్న సుధారెడ్డి



పదిపుట్లబైలులో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సుధారెడ్డి

పాకాల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి సుధారెడ్డి కోరారు.పాకాల మండలంలోని పదిపుట్లబైలు పంచాయతీ కొండకిందపల్లెలో శనివారం ఆమె పార్టీ నాయకులతో కలిసి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. రూ.లక్ష చెల్లించి శాశ్వత సభ్యతం నమోదు చేసుకున్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు బి.నాగరాజనాయుడు, జడ్పీటీసీ నంగా పద్మజ రెడ్డి, నాయకులు ఫల్గుణ, కె.సావిత్రి, చాముండేశ్వరి, బి.ఈశ్వర చౌదరి, ఎం.వెంకటేష్ బాబు, వి.కుమారస్వామి నాయుడు, చలపతి నాయుడు, బి.మహేష్ కుమార్, లింగయ్యనాయుడు, డి.మోహన్ నాయుడు, రావిళ్ల మోహన్, నరసింహ యాదవ్, దాము, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

చంద్రగిరిలో

చంద్రగిరి, అక్టోబరు 26:చంద్రగిరిలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శనివారం నాయకులు, కార్యకర్తలతో కలసి సీనియర్ నాయకుడు కుమారరాజారెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీకి కార్యకర్తలే కొండంత బలమన్నారు.టీడీపీ సీనియర్ నాయకులు రమేష్ రెడ్డి, తెలుగు రైతు విభాగం రాష్ట్ర నాయకుడు శివకోటేశ్వరరెడ్డి, తిరుపతి పార్లమెంటు ఉపాధ్యక్షుడు గౌస్‌బాషా, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్, తుడా మాజీ డైరెక్టర్ బాలకృష్ణమూర్తి, మాజీ సర్పంచ్ దుబాసి రామ్మూర్తి, నాయకులు మునిరత్నంరాయల్, పాశం చంద్రకుమార్‌నాయుడు, మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటముని తదితరులు పాల్గొన్నారు.

తిరుచానూరులో

తిరుచానూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని తిరుచానూరులో శనివారం పార్టీ నేతలు ప్రారంభించారు.టీడీపీ నేతలు ఈశ్వర్ రెడ్డి, అమిలినేని మధు, మధుశేఖర్, కిషోర్‌రెడ్డి, మునిరత్నంరెడ్డి, సాయిరాయల్, వాసు, జీవన్, అరుణాచలం తదితరులు పాల్గొన్నారు.





చంద్రగిరిలో, తిరుచానూరులో టీడీపీ సభ్యత్వ నమోదులో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

కర్ణాటకలో పేదల డబ్బు పక్కదారి పడుతోంది



- కేంద్రమంత్రి శోభ కరంద్లజే

తిరుమల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): 'కర్ణాటక పరిస్థితి అస్సలు బాగోలేదు. ఏడాదిన్నరగా అక్కడున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టడం లేదు, పేదలకు ఉపయోగించాల్సిన డబ్బు పక్కదారి పడుతోంది' అని కేంద్రమంత్రి శోభ కరంద్లజే అన్నారు. తిరుమల శ్రీవారిని శనివారం దర్శించుకున్న ఆమె ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు.ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం ప్రగతివైపు పరుగులు తీస్తోందన్నారు.దీనికి భగవంతుడి ఆశీస్సులు కూడా కావాలని కోరుకున్నట్టు తెలిపారు. కర్ణాటక ప్రభుత్వంలో భారీ అవినీతి జరుగుతోందన్నారు. అందుకే అక్కడ భవనాలు కూలిపోతున్నాయని, మనుషులు చనిపోతున్నారని అభిప్రాయపడ్డారు. ఉన్న డబ్బులన్నీ హామీల అమలుకోసం ఖర్చు పెట్టేశారని, ఇప్పుడు అవి కూడా అమలుకావడం లేదన్నారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

అమ్మవారి సేవలో కేంద్రమంత్రి

తిరుచానూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని పద్మావతి అమ్మవారిని కేంద్ర మంత్రి శోభ కరంద్లాజే శనివారం దర్శించుకున్నారు. దర్శనానంతరం వేదపండితులు ఆమెను అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆమె వెంట బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి వున్నారు.

రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు



తిరుపతి అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కరకంబాడీ రోడ్డు గెస్ట్‌లైన్‌డేస్ హోటల్ నుంచి దక్షిణంగా అన్నమయ్య మార్గ్‌లో విద్యుత్ స్తంభాలు రోడ్డు మధ్యలో ఉండడం సమస్యగా మారింది. రోడ్డు నిర్మాణ సమయంలో స్తంభాలను అంచుల్లో ఏర్పాటు చేయాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. ప్రస్తుతం ఈ మార్గంలో ట్రాఫిక్ పెరిగింది. విద్యుత్ స్తంభాలు రోడ్డుపై కనిపిస్తుండడం వాహనదారులకు ఆందోళన కలిగిస్తోంది. ఆదమరపుగా వెళ్లిన వారు ఢీకొడుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ పైభాగంలో విద్యుత్ తీగలు వాహనాలను తాకేలా ఉండడం ప్రమాదంగా మారింది.



వాహనాలను తాకేలా ఉన్న విద్యుత్ తీగలు

పార్టీలకు అతీతంగా అభివృద్ధికి కలసి పనిచేద్దాం

- మండల సమావేశంలో ఎమ్మెల్యే పులివర్తి నాని



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని

యర్రావారిపాలెం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పార్టీలకు అతీతంగా అభివృద్ధికి కలసి పనిచేద్దామంటూ చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అధికారులకు, నాయకులకు పిలుపునిచ్చారు.యర్రావారిపాలెం మండల సమావేశం శనివారం ఎంపీపీ రెడ్డమ్మ అధ్యక్షతన నిర్వహించారు.సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు చేయూతను అందించాల్సిన అవసరం ఉందన్నారు.గత ప్రభుత్వంలో ఎన్నో అవకతవకలు జరిగాయని, వాటిపైన దృష్టిసారించి నిశితంగా పరిశీలన చేసి నిగ్గు తేల్చాలన్నారు. పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను పరిశీలించి నివేదిక ఇస్తే మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకు వెళ్లి నిధులు మంజూరు చేయించుకొస్తానని చెప్పారు. గత పాలనలో వెనుకబడిన అభివృద్ధిని గ్రామాల ముంగిటికి తీసుకువస్తామని తెలిపారు.అధికారులు బాధ్యతగా పనిచేస్తే తాను వెన్నుదన్నుగా ఉంటానన్నారు. అంతకుముందు తలకోన సిద్దేశ్వర స్వామిని ఎమ్మెల్యే నాని దర్శించుకున్నారు. అర్చన, అభిషేక సేవలో పాల్గొన్నారు.ఈవో మమత, అర్చకులు ప్రసన్నస్వామి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ అభివృద్ధిపై సమీక్ష జరిపారు.

నిరుపయోగంగా వైఎస్సార్ రిసెప్షన్ కేంద్రాలు..!

- హాళ్లలో వుడ్ మెటీరియల్, చెత్త సేకరణ డస్ట్‌బిన్లు డంప్ చేసిన వైనం







తహసీల్దార్ కార్యాలయంలోని వైఎస్సార్ రిసెప్షన్ కేంద్రం, లోపల డంప్ చేసిన వుడ్ మెటీరియల్, ప్లాస్టిక్ డబ్బాలు
ఎంపీడీవో కార్యాలయంలోని వైఎస్సార్ రిసెప్షన్ కేంద్రం

తిరుపతి రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండల తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల ప్రాంగణాల్లో గత వైసీపీ ప్రభుత్వంలో తుడా నిధులతో నిర్మించిన వైఎస్సార్ రిసెప్షన్ కేంద్రాలు (వెయిటింగ్ హాల్స్) నిరుపయోగంగా మారాయి. మండల కార్యాలయాలకు వివిధ సమస్యలపై వచ్చే ప్రజలు వేచి ఉండేందుకు దాదాపు నాలుగేళ్ల కిందట ఏర్పాటు చేసిన ఈ కేంద్రాలను ఇప్పటివరకు అందుబాటులోకి తీసుకురాలేదు. తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలోని వెయిటింగ్ హాల్‌లో వుడ్ మెటీరియల్, ప్లాస్టిక్ డబ్బాలను డంప్ చేసి అలాగే వదిలేయగా.. ఎంపీడీవో కార్యాలయంలోని భవనంలో చెత్తసేకరణ డస్ట్‌బిన్లను డంప్ చేశారు. దీంతో వివిధ పనులపై తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలకు వచ్చే పలువురు అర్జీదారులు చెట్ల కిందనే గంటల తరబడి నిలుచుని తమపని చూసుకుని వెళ్లిపోతున్నారు. తమ కోసం వెయిటింగ్ హాల్స్‌ని ఏర్పాటు చేశారన్న విషయం కూడా ప్రజలకు తెలియని పరిస్థితి. దీనికితోడు ఇప్పటివరకు ఈ కేంద్రాల తలుపులు తెరచుకున్న దాఖలాలు కూడా లేవని తెలిసింది. ఇకనైనా అధికారులు స్పందించి ఈ కేంద్రాలలో డంప్ చేసిన మెటీరియల్‌ని తొలగించి, వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

కలెక్టర్‌ను కలిసిన డీఈవో

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లా నూతన విద్యాశాఖాధికారిగా వెంకట నాగేంద్ర కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఎస్వీ మ్యూజియం పనుల పరిశీలన

తిరుమల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని ఎస్వీ మ్యూజియంలో జరుగుతున్న అభివృద్ధి పనులను టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి శనివారం పరిశీలించారు. పనుల పురోగతిపై సంబంధిత అధికారులను ఆరా తీశారు. వేగవంతంగా పనులు పూర్తి చేసి భక్తుల సందర్శనానికి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. మ్యూజియం ఆఫీసర్ విజయలక్ష్మి, డిప్యూటీఈవో ఆశాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కుంకీలతో గజదాడులను అరికడతాం

● చీఫ్ కన్జర్వేటర్ అజయ్‌కుమార్ నాయక్



ఏనుగుల దాడిలో ధ్వంసమైన వరిపంట

కల్లూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జనావాసాలు, పంట పొలాలపై ఏనుగుల దాడులను అరికట్టేందుకు త్వరలో కుంకీ ఏనుగులతో రక్షణ చర్యలు తీసుకుంటామని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ వైల్డ్‌లైఫ్ అజయ్‌కుమార్ నాయక్, తిరుపతి చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సెల్వం తెలిపారు. పులిచెర్ల మండలం పాళెం పంచాయతీ సమీపంలోని తూర్పు అటవీ ప్రాంతాన్ని శనివారం సాయంత్రం చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లా డీఎఫ్‌వోలు భరణి, వివేక్, జగన్నాధసింగ్‌లతో కలిసి వారు పరిశీలించారు. పలమనేరు కౌండిన్య అటవీప్రాంతం నుంచి రెండేళ్ల క్రితం పులిచెర్ల మండలంలోకి ప్రవేశించిన ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేస్తున్న నేపథ్యంలో ఏనుగులు దాడులు చేస్తున్న తీరు, అధికారులు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. ఏనుగుల గుంపు సంచరించే అటవీ ప్రాంతాలను మ్యాప్‌లో పరిశీలించారు.ఈ సందర్భంగా అజయ్‌కుమార్ నాయక్ మాట్లాడుతూ ఏనుగుల గుంపు జనారణ్యంలోకి వస్తుండడంతో జరుగుతున్న నష్టంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.గజదాడులను కుంకీ ఏనుగుల సాయంతో అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలోనే ఏనుగుల గుంపును కౌండిన్య అటవీప్రాంతం వైపు తీసుకెళ్లేందుకు కుంకీ ఏనుగులను తీసుకొస్తామని తెలిపారు.ఫ్లయింగ్‌స్క్వాడ్ డీఎఫ్‌వో గురుప్రభాకర్, మదనపల్లె సబ్ డీఎఫ్‌వో శ్రీనివాసులు, ఎఫ్‌ఆర్‌వోలు థామస్ సుకుమార్, ప్రియాంక, వేణుగోపాల్, మాధవి, ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఫ్‌ఆర్‌వో చంద్రశేఖర్, డిప్యూటీ రేంజర్ కుప్పుస్వామి, ఎఫ్ఎస్‌వో మహ్మద్ షఫీ, ఎఫ్‌బీవోలు పాల్గొన్నారు.

పంటలపై కొనసాగిన గజదాడులు

పులిచెర్ల మండలం దేవళంపేట పంచాయతీలో శుక్రవారం రాత్రి పంటలపై గజదాడులు కొనసాగాయి. కొబ్బరి, వరి, మామిడి పంటలకు అపారనష్టం వాటిల్లింది. కుమ్మరపల్లిలో సి. కృష్ణయ్యకు చెందిన 11 కొబ్బరి చెట్లు, 3 మామిడిచెట్లు, ఎం. కృష్ణయ్యకు చెందిన 3 మామిడిచెట్లతో పాటు పశుగ్రాసాన్ని ఏనుగులు ధ్వంసం చేశాయి.వంకాయలపాటివారిపల్లిలో రవీంద్రనాయుడికి చెందిన ఎకరా వరిపంటను ధ్వంసం చేసిన ఏనుగులు 20 మామిడిచెట్లను విరిచేశాయి.



కల్లూరు సమీపంలోని అడవిలో
ఏనుగులు తిరిగే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అజయ్‌కుమార్‌నాయక్

శ్రీవారి సేవలో ప్రముఖులు





ఆలయం ముందు ఐశ్వర్య రాజేష్ - యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

తిరుమల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): విశ్వ భాషా పరిరక్షణ సమితి చైర్మన్, మాజీ రాజ్యసభ సభ్యుడు యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్, సినీ హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

సమాచారహక్కు చట్టంపై అవగాహన పెంచుకోవాలి

రామచంద్రాపురం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): సమాచారహక్కుచట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని మండల వ్యవసాయాధికారిణి స్రవంతి అన్నారు.రామచంద్రాపురం మండలంలోని గంగిరెడ్డిపల్లి రైతు సేవా కేంద్రంలో సమాచార హక్కు చట్టంపై మండల, గ్రామస్థాయి అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించేందుకు కార్యాలయాల్లో సమాచార హక్కు బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. రైతు సేవా కేంద్రాల వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

స.హ చట్టం గురించి రైతులు తెలుసుకోవాలి

చంద్రగిరి, అక్టోబరు 26: సమాచార హక్కు చట్టంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయాధికారి విజయ భాస్కర్ అన్నారు. శనివారం చంద్రగిరి మండలం మఠంపల్లెలో రైతు సేవా కేంద్రంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఏవో మాట్లాడుతూ ఈచట్టం ద్వారా ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు కావాల్సిన సమాచారాన్ని దరఖాస్తు చేసుకొన్న వారికి అందిస్తారని తెలిపారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.78 కోట్లు

తిరుమల, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామికి హుండీ ఆదాయం రూ.3.78 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించి, శనివారం ఉదయం ప్రకటించింది. శుక్రవారం 56,501 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 21,203 మంది తలనీలాలు సమర్పించారు.



చంద్రగిరి మండలంలోని మూలపల్లె చెరువు

పది చెరువులకు సాగునీటి సంఘాల ఎన్నికలు

● ఓటర్ల జాబితాకు సిద్ధమవుతున్న అధికారులు
● ఒక్కో సంఘానికి ఆరుగురు టీసీ మెంబర్లు
● టీసీ మెంబర్లచే అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవుల ఎన్నిక

చంద్రగిరి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలంలో పది చెరువులకు సాగునీటి సంఘాల ఎన్నికలు జరగనున్నాయి. ఇందు కోసం ఇరిగేషన్ అధికారులు చెరువుల ఆయకట్టు వివరాలను రెవెన్యూ అధికారులకు పంపించి ఓటర్ల జాబితా తయారీకి సిద్ధమవుతున్నారు. ఒక్కో చెరువుకు ఆరుగురు టీసీ మెంబర్ల (టెరిటోరియల్ కానిస్టెన్సీ)ను నియమించి, అందులో అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులను ఎన్నుకోనున్నారు. చంద్రగిరి మండలంలో ఎ.రంగంపేట వద్ద నాగపట్ల చెరువు కింద 167 ఎకరాలు, చిన్నరామాపురం వద్ద కణితమడుగు చెరువు 500 ఎకరాలు, కొంగ్రెడ్డికండ్రిగ చెరువు 110 ఎకరాలు, మూలపల్లెచెరువు 250 ఎకరాలు, పుల్లయ్యగారిపల్లె వద్ద కదంకాలువ 140 ఎకరాలు, కొటాల వద్ద వెంకట్రాయుని చెరువు 116 ఎకరాలు, కల్‌రోడ్డుపల్లె వద్ద పాలేటికోన చెరువు 313 ఎకరాలు, ఆముదాలకోన ఎస్టీ కాలనీ వద్ద పోట్లకోన చెరువు 352 ఎకరాలు, అరిగిలవారిపల్లె వద్ద మాలవాని చెరువు 266 ఎకరాలు, మండపంపల్లె వద్ద జర్లకోన చెరువు కింద 170 ఎకరాల ఆయకట్టు ఉంది. దీంతో ఇరిగేషన్ అధికారులు ఇప్పటికే ఓటరు జాబితాను తయారు చేయడానికి రెవెన్యూ అధికారులకు నివేదికలు పంపారు. ఈనెల 31వ తేదీకి ఓటరు జాబితా విడుదల చేస్తారని, నవంబరు 1, 2 తేదీలలో ఓటరు పేర్ల సవరణ, అభ్యంతరాల స్వీకరణ ఉంటుందన్నారు. 3, 4 తేదీలలో అభ్యంతరాలపై స్క్రూట్నీ జరుగుతుందన్నారు. అనంతరం ఓటర్ల జాబితాను ఉన్నతాధికారులకు పంపనున్నారు. నవంబరు 20వ తేదీన గ్రామ సభలు నిర్వహించి, అందులో డైరెక్టర్లను ఎన్నుకోనున్నారు. 21వ తేదీన సాగునీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నిక జరగనుంది.

రాష్ట్రంలో ఆదర్శంగా నిలిచేలా సభ్యత్వ నమోదు

మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ



టీడీపీ శాశ్వత సభ్యత్వం కోసం రూ.లక్ష చెక్కును నరసింహయాదవ్, సుగుణమ్మలకు అందజేస్తున్న మన్నెం శ్రీనివాసులు నాయుడు

తిరుపతి (జీవకోన), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): సభ్యత్వ నమోదు కార్యక్రమంలో తిరుపతిని రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచేలా చేద్దామని టీడీపీ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ పిలుపునిచ్చారు. సీఎం చంద్రబాబు పిలుపు మేరకు తిరుపతి నియోజకవర్గంలోని జీవకోన 49వ డివిజన్ రాజీవ్‌గాంధీ కాలనీలో శనివారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా సుగుణమ్మ, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నెం శ్రీనివాసులు నాయుడు రూ.లక్ష చెల్లించి శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. అనంతరం ఆమె కార్యకర్తలనుద్దేశించి టీడీపీకి తిరుపతి కంచుకోటవంటిదన్నారు. తిరుపతిలో జరిగే సభ్యత్వ నమోదు కార్యక్రమం రాష్ట్రంలో ఆదర్శంగా నిలిచేలా ప్రతి కార్యకర్త, నాయకుడు కృషి చేయాలని కోరారు. తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు నరసింహయాదవ్ మాట్లాడుతూ రికార్డుస్థాయిలో సభ్యత్వ నమోదు చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సభ్యత్వ నమోదు తీసుకున్న ప్రతి ఒక్కరికీ పార్టీ అండగా ఉండటంతో పాటు బీమా సౌకర్యం ఉంటుందన్నారు. అనంతరం ఆన్‌లైన్ సభ్యత్వ నమోదు చేపట్టారు. పార్టీ నాయకులు దంపూరి భాస్కర్‌యాదవ్, డాక్టర్ కోడూరు బాలసుబ్రహ్మణ్యం రూ.లక్ష చెల్లించి శాశ్వత సభ్యత్వం తీసుకున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మబ్బు దేవనారాయణరెడ్డి, రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ, పులిగోరు మురళీకృష్ణారెడ్డి, చిట్టిబాబు, రాష్ట్ర మహిళా కార్యదర్శి కుమారమ్మ, రామకృష్ణ, స్థానిక కార్పొరేటర్ అన్నా సంధ్య, చిన్నబాబు, బుల్లెట్ రమణ, ఊట్ల సురేంద్ర నాయుడు, అన్నా మల్లీశ్వరి, మధుసూదన్ నాయుడు, సుధాకర్, లక్ష్మీపతి నాయుడు, వెంకటరత్నం, రుద్రకోటి సదాశివం, కృష్ణయాదవ్, బ్యాంకుశాంతమ్మ, లోకేష్ నాయుడు, దండు విజయ్, లక్ష్మయ్య, హేమంత్‌రాయల్, లక్ష్మి, పాటకం వెంకటేష్, ఆముదాల తులసీరామ్, ఆర్‌పీ శ్రీనివాసులు, దాము, మహ్మద్ రఫీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌సీడబ్ల్యూసీ మెంబర్‌గా మించల ప్రదీప్



తిరుపతి అర్బన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): జాతీయ షెడ్యూల్ కులాల సంక్షేమ మండలి సభ్యుడిగా స్థానిక మించల ప్రదీప్ నియమితులయ్యారు. ఈ మేరకు నేషనల్ షెడ్యూల్‌క్యాస్ట్ వెల్ఫేర్ కౌన్సిల్(ఎన్‌ఎస్‌సీడబ్ల్యూసీ)అండర్ సెక్రటరీ వి.ప్రసాద్ ఉత్తర్వులు జారీచేశారు. తన నియామకానికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. బహుజనుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. పలువురు స్నేహితులు, బంధువులు ఆయన్ను అభినందించారు.

రూ.6,073 కోట్ల విద్యుత్ భారాన్ని ఉపసంహరించండి

కందారపు మురళి

తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నూతనంగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలపై పెంచనున్న రూ.6,073 కోట్లు పెనుభారాన్ని ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వం సర్దుబాటు చార్జీలు పెంచినపుడు విమర్శించిన కూటమి పార్టీలు, తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచమని హామీ ఇచ్చిన పాలక ప్రభుత్వం, సర్దుబాటు చార్జీలు అని చెపుతూ కోట్ల రూపాయలు ప్రజలపై భారం మోపడాన్ని సీపీఎం, సీఐటీయూ తీవ్రంగా ఆక్షేపిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రైవేటు పెట్టుబడిదారుల నుంచి పీక్‌లోడ్ సమయంలో అధికధరలకు విద్యుత్ కొనుగోలు చేశామని చెప్పడం ఎంతవరకు సమంజసమన్నారు.పెంచనున్న చార్జీల నిర్ణయాన్ని రద్దు చేసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

సరికొత్తగా తుడా టవర్స్

14 అంతస్తుల్లో సిటీ ఐకానిక్ బిల్డింగ్

కమర్షియల్, రెసిడెన్షియల్ స్పేస్‌తో నిర్మాణం

16 నెలల్లో పూర్తికి సన్నాహం - తుడా వీసీ మౌర్య



తుడా టవర్స్ గురించి వివరిస్తున్న వీసీ మౌర్య

తిరుపతి,అక్టోబర్26(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో తుడా టవర్స్ సరికొత్తగా ఆవిష్కృతం కానుంది. గత వైసీపీ ప్రభుత్వంలో పునాదులకే పరిమితమైన తుడా టవర్స్ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత శరవేగంగా నిర్మాణం జరుపుకుంటోంది. రూ.345 కోట్ల వ్యయంతో 14 అంతస్తుల్లో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న టవర్స్ నగరానికి ఒక ఐకానిక్ భవనంగా మారనుందని తుడా వీసీ ఎన్.మౌర్య చెప్పారు. అన్నమయ్య సర్కిల్ వద్ద జరుగుతున్న నిర్మాణ పనులను అధికారులతో కలసి శనివారం ఆమె పరిశీలించారు. అనంతరం తుడా టవర్స్‌పై సమీక్షించి మీడియాతో మాట్లాడారు. తుడా టవర్స్ అన్ని వర్గాలకు అందుబాటులో ఉండేలా 3.6 ఎకరాల స్థలంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, వసతులతో నిర్మిస్తున్నామన్నారు. గ్రౌండ్, ఒకటవ అంతస్తుల్లో 27 విశాలమైన గదులతో వాణిజ్య సముదాయాలు, రెండు, మూడు, నాలుగు అంతస్తులలో ఆఫీసల వినియోగానికి, మిగిలిన అంతస్తుల్లో నివాస యోగ్యంగా ప్లాట్లను నిర్మిస్తున్నామని తెలిపారు. 230 రెసిడెన్షియల్ ఫ్లాట్లు ఉంటాయని, అందులో 42 డబుల్ బెడ్ రూమ్ ఫ్లాట్లు, 152 ట్రిబుల్ బెడ్ రూమ్స్ 32 నాలుగు బెడ్ రూమ్ ఫ్లాట్లు ఉంటాయని వివరించారు. అదేవిధంగా కమర్షియల్, రెసిడెన్షియల్‌కు వేర్వేరుగా విశాలమైన పార్కింగ్, లిఫ్టులు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 2026 మార్చిలోపు అన్ని పనులు పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని చెప్పారు. విస్తృతంగా ప్రచారం చేసేందుకు నూతనంగా బ్రోచర్ కూడా తయారు చేయించామని, ఇందులో అన్ని వివరాలు పొందుపరిచామన్నారు. ఈసమావేశంలో కార్యదర్శి వెంకటనారాయణ, సూపరింటెండెంట్ ఇంజనీర్ కృష్ణారెడ్డి, సలహాదారులు రామకృష్ణారావు, ఈఈ రవీంద్రయ్య, కె.పి.సి సంస్థ ఈడీ సునీల్ కుమార్ తదితరులు ఉన్నారు

● **ఐకానిక్ టవర్స్‌లో వసతులు, ధరలు ఇలా..**

స్విమ్మింగ్ పూల్, వాకింగ్ పార్కు, పోడియం, చిల్డ్రన్స్ ప్లే ఏరియా, రెస్టారెంట్, బంకేట్ హాల్, సూపర్ మార్కెట్, బ్యాంక్, బ్యాడ్మింటన్ కోర్టులు, యోగ ఇతర ఇండోర్ క్రీడల సౌకర్యాలను అందుబాటులో ఉంచనున్నారు. రెసిడెన్షియల్ కోసం 2బీహెచ్‌కే (1238 ఎస్ఎఫ్టీ-రూ.70లక్షలు), 3బీహెచ్‌కే (1903 ఎస్ఎఫ్టీ-రూ.1.12కోట్లు), 4బీహెచ్‌కే (3743 ఎస్ఎఫ్టీ-రూ.2.19కోట్లు) ఫ్లాట్లను నిర్మించనున్నారు. కమర్షియల్ కోసం గ్రౌండ్ ఫ్లోర్ 42,664 ఎస్ఎఫ్టీ- (రూ.12వేలు ఒక ఎస్ఎఫ్టీ ధర), ఫస్ట్ ఫ్లోర్ 64,724 (రూ.10వేలు), ఆఫీస్ స్పేస్ 89,919 ఎస్ఎఫ్టీ (రూ.7,500) ధరగా నిర్ణయించారు.

మల్టీపర్పస్ ప్రాక్టీస్ హాల్ పునర్నిర్మాణానికి చర్యలు



పాచిపట్టి ఉన్న స్పోర్ట్స్ మల్టీపర్పస్ ప్రాక్టీస్ హాల్

తిరుపతి(క్రీడలు), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): శ్రీనివాస క్రీడా సముదాయంలోని స్పోర్ట్స్ మల్టీపర్పస్ ప్రాక్టీస్ హాల్ పునర్నిర్మాణానికి చర్యలు ప్రారంభమయ్యాయి. యువ క్రీడాకారుల సౌకర్యార్థం ఇండోర్ స్టేడియానికి ఆగ్నేయంగా రూ.15లక్షల వ్యయంతో హాల్ నిర్మాణం 2019లో ప్రారంభించారు. దాదాపు 65 శాతం పనులు పూర్తయ్యాయి. వైసీపీ అధికారంలోకి వచ్చాక పూర్తిగా పక్కనపెట్టేశారు. దీంతో గోడలు పాచిపట్టి దాదాపుగా శిథిలావస్థకు చేరుకున్నట్లు కనిపిస్తోంది. ఇటీవల సమదాయంలో పర్యటించిన కలెక్టర్ వెంకటేశ్వర్, శాప్ చైర్మన్ రవినాయుడు నిర్మాణాన్ని పరిశీలించి పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంచనాలు సిద్ధం చేసిన తర్వాత శాప్‌కు నివేదిక పంపుతామని, ఆ వెంటనే పనులు ప్రారంభించి అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటామని జిల్లా క్రీడాధికారి సయ్యద్‌సాహెబ్ తెలిపారు.

ఏ పనిలో అయినా మాకు సాటి లేరు

● **ఆర్య వర్క్‌లో మెలకువలు నేర్చుకుంటున్న మహిళలు**



ఆర్య వర్క్‌లో శిక్షణ పొందుతున్న మహిళలు

తిరుపతి (జీవకోన), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మహిళలు తలుచుకుంటే ఏ పనినైనా అమాంతం చేసేస్తుంటారు. కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు అన్న పెద్దల సామెతను ఈ మహిళా మణులు నిజం చేస్తున్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాల్లో జన్మించిన వీరంతా ఎలాగైనా ఉపాధి పొందాలి... సమాజంలో గౌరవంగా బతకాలి అన్న తపనతో రాస్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 80రోజుల శిక్షణ కార్యక్రమంలో ఆర్య వర్క్‌లో మెలవకులు నేర్చుకుంటున్నారు. సాధారణంగా ఆర్యవర్క్‌లో ఎక్కువ భాగం మగవారు ప్రావీణ్యం పొందుతారు. అయితే వారికేమీ తీసిపోము అన్నట్టుగా మహిళలు ఎంతో పట్టుదలతో ఈ వర్క్‌ను నేర్చుకుంటున్నారు. ఈ దృశ్యం జీవకోన పరిధిలోని రాజీవ్‌గాంధీ కాలనీలో శనివారం ఉదయం కనిపించింది. రాస్ సంఘాలలో శిక్షణ కావాలనుకునేకుంటే ఓ 20మంది గ్రూప్‌గా ఏర్పడి టైలరింగ్, బ్యూటీషీయన్, ఆర్య వర్క్‌లపై శిక్షణ పొందేందుకు అవకాశం ఉంది.

నలుగురు స్మగ్లర్ల అరెస్టు

35ఎర్రచందనం దుంగల స్వాధీనం



పట్టుబడ్డ ఎర్రచందనంతో టాస్క్‌ఫోర్సు పోలీసులు, అటవీశాఖ అధికారులు



మంగళం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రెండు వేర్వేరు సంఘటనల్లో టాస్క్‌ఫోర్సు పోలీసులు, అటవీశాఖ అధికారులు నలుగురు స్మగ్లర్లను అరెస్టు చేసి 35 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఎస్ఐ పి.సురేష్ బృందం స్థానిక అటవీశాఖ సిబ్బందితో కలిసి శనివారం తెల్లవారుజామున అన్నమయ్య జిల్లా సానిపాయ వద్ద సానిపాయ-రాయచోటి రోడ్డులో తనిఖీలు నిర్వహించారు. బొల్లువాండ్లపల్లి రోడ్డు వద్ద కొందరు వ్యక్తులు కనిపించారు. వీరు పోలీసులను చూసి పారిపోతుండగా నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారిని తమిళనాడు రాష్ట్రం కళ్లకురిచ్చి, సేలం జిల్లాలకు చెందినవారిగా గుర్తించారు.వీరి నుంచి రవాణాకు సిద్ధంగా ఉన్న 26 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు వీరిని తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీఐ సురేష్‌కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అలాగే మరో ఘటనలో తిరుపతి రేంజ్ అటవీశాఖ అధికారి సుదర్శన్‌రెడ్డికి అందిన రహస్య సమాచారం మేరకు శనివారం తెల్లవారుజామున నాలుగు గంటలకు రేణిగుంట-కడపరోడ్డులోని ఆంజనేయపురం చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా, టీఎన్03-3839 నెంబరు గల ఫోర్డుకారు అటువైపు వేగంగా వచ్చింది. కారును అటవీశాఖ అధికారులు ఆపే ప్రయత్నంచేయగా ఆపకుండా వెళ్లిపోవడంతో అధికారులు వెంబడించారు. స్మగ్లర్లు మామండూరు పొదల్లో కారును వదలి పారిపోవడంతో అధికారులు వాహనంలో తనిఖీ చేయగా 9 ఎర్రచందనం దుంగలను గుర్తించారు. దీంతో కారును, అందులోని ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ ఎర్రచందనం 294 కేజీలు బరువు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎఫ్ఎస్‌వో రవీంద్ర, ఎఫ్‌బీవోలు వెంకటేశ్వరరావు, కుమారి, కిషోర్, బేస్‌క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

అమరావతికి 50 వేల ఎకరాలు అవసరమా...?

కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్



కాంగ్రెస్ నేతలతో కలిసి చింతా మోహన్ నిరసన

తిరుపతి(వైద్యం), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీని 17 వేల ఎకరాల్లో పూర్తి చేస్తే.. మన రాజధాని అమరావతి నిర్మాణానికి 50 వేల ఎకరాలు అవసరమా... అక్కడ ఎంత మంది వీఐపీలు, మంత్రులు ఎన్ని వేల ఎకరాలు కొన్నారో ఆ వివరాలన్నింటినీ బయటపెట్టి వాటికి సీఎం చంద్రబాబు సమాధానం చెప్పాలని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు ఆయన శనివారం కాంగ్రెస్ నేతలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ అమరావతి నిర్మాణం పేరుతో రూ.వేల కోట్లు ఖర్చు చేస్తున్నారని, అది వందేళ్లకు కూడా పూర్తయ్యే పరిస్థితి లేదని విమర్శించారు. అమరావతి నిర్మాణం ఎప్పటికి పూర్తవుతుందో చంద్రబాబు సమాధానం చెప్పాలన్నారు. తిరుపతిలోని నిరుపేద మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు నెల రోజుల్లో పరిష్కారం చూపకపోతే కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోపి గౌడ్, రవి, రావణ్, తేజోవతి, శాంతి యాదవ్, ముని శోభ, వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యంషాపు మీద దాడి చేస్తాం - ఎస్ఎఫ్ఐ



నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

తిరుపతి (ఎం.ఆర్.పల్లె), అక్టోబర్ 26 (ఆంధ్రజ్యోతి): ఎం.ఆర్.పల్లె సర్కిల్లో ఏర్పాటు చేసిన మద్యంషాపును తొలగించాలని, లేనిపక్షంలో దాని మీద దాడి చేస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అక్బర్ పేర్కొన్నారు. శనివారం ఎస్ఎఫ్ఐ నాయకులు విద్యార్థులతో కలిసి అక్కడ నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతి జిల్లాకు అత్యధికంగా మద్యం షాపులు కేటాయించడం దారుణమని అన్నారు. ఎం.ఆర్.పల్లె సర్కిల్‌లో ఏర్పాటు చేసిన మద్యం షాపు చుట్టు పక్కల దాదాపు 20 కళాశాలల్లో 20వేలకుపైగా విద్యార్థులు చదువుతున్నారని, ప్రతిరోజూ మద్యంషాపు ముందే రాకపోకలు సాగించాల్సి ఉందని, మద్యం సేవించిన వారు దాడులు చేసే ప్రమాదం ఉందన్నారు. ఇక్కడ నుంచి మద్యం దుకాణం తొలగించి మరొక ప్రాంతంలో ఏర్పాటు చేసుకోవాలని కోరుతూ ఎక్సైజ్ సీఐ రామచంద్రకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రవి, సాయిలక్ష్మి, రైతు సంఘ జిల్లా కార్యదర్శి హేమలత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, కార్మికుల సమస్యలను పరిష్కరించేది ఐఎన్‌టీయుసీనే

ఏపీఎస్ఈఈయూ సెక్రటరీ జనరల్ ఎంవీ రాఘవరెడ్డి

తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో తమ సంఘం కీలక పాత్ర పోషిస్తోందని ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంవీ రాఘవరెడ్డి వెల్లడించారు. తిరుపతిలోని సదరన్ డిస్కం కార్యాలయం ఎదుట కార్మిక సంఘం 70వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పతాకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగ, కార్మిక సంక్షేమం కోసం తమ సంఘం చేసిన సేవలను వివరించారు. భవిష్యత్తులో తమ సంఘం బలోపేతం కానుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.రాఘవేంద్ర ప్రసాద్, షణ్ముగం. ఆర్.మురళీధర్, రత్నకుమార్, శైలజ, రవిచంద్ర, లక్ష్మీకాంత్‌రెడ్డి, దామ్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నగర సంకీర్తన



తిరుపతి(కల్చరల్), అక్టోబర్ 26 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన నగర సంకీర్తన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులు ఉదయాన్నే గోవిందరాజుల తేరువీధిలోని ఆంజనేయస్వామిగుడి నుంచి గోవిందరాజ స్వామి ఆలయ నాలుగు మాడవీధుల్లో తిరునామాలు ధరించి, సంకీర్తనలు, భజనలతో నగర సంకీర్తన సంప్రదాయ రీతిలో నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో రాయలసీమ రంగస్థలి అధ్యక్షుడు గోపినాథరెడ్డి, సభ్యులు, భక్తులు, గాయకులు, కళాకారులు పాల్గొన్నారు.

రుయాలో హెచ్‌డీఎస్ వర్కింగ్ చైర్మన్ పదవే లేదు

హెచ్‌డీఎస్ సభ్యుడు లక్ష్మీపతి తీరుపై విచారణ : సూపరింటెండెంట్

తిరుపతి(వైద్యం), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): రుయాస్పత్రిలో కేవలం హెచ్‌డీఎస్ కమిటీ మాత్రమే ఉందని, దీనికి చైర్మన్‌గా కలెక్టరు, కోచైర్మన్‌గా ఎమ్మెల్యే ఉంటారని, వర్కింగ్ చైర్మన్ అనే పదవి లేదని, ఆ పేరుతో సభ్యులు చెలామణి అయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రుయా సూపరింటెండెంట్ రవిప్రభు శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. హెచ్‌డీఎస్ సభ్యుడు బండ్ల లక్ష్మీపతి హెచ్‌డీఎస్ వర్కింగ్ చైర్మన్ అని చెప్పుకుంటూ ఆస్పత్రిలో వైద్యులను, రోగులను ఇబ్బందులకు గురిచేసిన విషయంపై ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై రుయా అధికారులు రెండు రోజులుగా పూర్తి స్థాయిలో విచారణ చేపట్టారు. లక్ష్మీపతి చిన్నపిల్లల విభాగం ముందు ఏర్పాటు చేసిన శిలాఫలకంలో ఎమ్మెల్యే తర్వాత హెచ్‌డీఎస్ చైర్మన్ హోదాతో తన పేరును నమోదు చేయాలని చిన్నపిల్లల విభాగాధిపతి మనోహర్‌కు ఆదేశించినట్లు అధికారుల విచారణలో తేలింది. తనకు ప్రత్యేక గదిని కేటాయించాలని సూపరింటెండెంట్‌పై తీవ్రస్థాయిలో ఒత్తిడి తీసుకువచ్చినట్లు తెలిసింది. ఆస్పత్రిలో ఆక్సిజన్ మాస్కుతో ఉన్న రోగి సైతం ఆయన వలన ఇబ్బంది పడినట్లు అధికారుల విచారణలో తేలింది. వీటన్నింటిపై అధికారులు నివేదికలు సిద్ధం చేసి కలెక్టరుకు అందజేసినట్లు రవిప్రభు తెలిపారు. ఆస్పత్రి ఆవరణలో ఆయనకు సంబంధించిన అన్నీ ఫ్లెక్సీలను తొలగించామని, శిలాఫలకాలపై ఆయన పేరు నమోదు చేయకూడదని అధికారులకు ఆదేశించినట్లు పేర్కొన్నారు.

నిర్మాణం కూల్చారంటూ టీడీపీ నేతపై కేసు నమోదు

తిరుపతి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తమ స్థలంలో చేపట్టిన నిర్మాణంతో పాటు బోరు, మోటర్లను ధ్వంసం చేశారంటూ రిటైర్డు డీఎస్పీ నూతలపాటి భాస్కర నాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ అల్లుడు, టీడీపీ నేత లవ సంజయ్, మరో ముగ్గురిపై ముత్యాలరెడ్డిపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఫిర్యాదు చేసిన రిటైర్డు డీఎస్పీ కథనం మేరకు... తిరుచానూరు సర్వే నంబరు 255-1బిలో తనకు కొనుగోలు ద్వారా, అలాగే జీపీఏ ద్వారా సంక్రమించిన భూమిలో భాస్కర నాయుడు షాపు గది నిర్మాణం చేపట్టారు. ఈనెల 23వ తేదీ బుధవారం అర్ధరాత్రి 1.15 గంటల సమయంలో టీడీపీ నేత సంజయ్, చైతన్యప్రతాప్, జీవ, విజయ్ అలియాస్ విజ్జీలు మరో 40 మందితో కలసి ఆ గది గోడలను కూల్చివేశారు. అలాగే అక్కడే వున్న బోరుబావిని, దాని మోటరును కూడా ధ్వంసం చేశారు.ఈ విషయమై టీడీపీ నేత సంజయ్‌ని వివరణ అడగ్గా ఆ స్థలంతో తనకు ఎటువంటి సంబంధం లేదన్నారు.తనపై ఆయన చేసిన ఆరోపణలు అసత్యాలన్నారు.

ఘనంగా ఆయుధపూజ

తిరుమల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): టీటీడీ ట్రాన్స్‌పోర్టు తిరుమల విభాగంలో ప్రతి ఏటా నిర్వహించే ఆయుధపూజ శనివారం స్థానిక వర్క్‌షాప్‌లో ఘనంగా జరిగింది. అదనపు ఈవో వెంకయ్య చౌదరి ముఖ్య అతిథిగా వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుమలలోని వివిధ టీటీడీ వాహనాలను పుష్పగుచ్చాలు, అరటి తోరణాలు సంప్రదాయబద్ధంగా అలంకరించారు. శ్రీవారి విగ్రహానికి పూజలు నిర్వహించిన అనంతరం ప్రసాదాలు పంపిణీ చేశారు. ట్రాన్స్‌పోర్టు జీఎం శేషారెడ్డి, డిప్యూటీఈవో భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


ఆయుధాలపై అవగాహన కల్పిస్తున్న అదనపు ఎస్పీ వెంకట్రావు

పోలీసు ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన
ఆకట్టుకున్న ఓపెన్ హౌస్ ప్రదర్శన

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పోలీసు ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన అవసరమని జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వెంకట్రావు పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శనివారం తిరుపతిలోని వివిధ కళాశాలల విద్యార్థులకు వ్యాసరచన, డిబేట్ పోటీలు నిర్వహించారు. అమరులైన పోలీసులకు అంజలి ఘటించారు. అదనపు ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలను ప్రజలందరికీ తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. అనంతరం ఓపెన్ హౌస్‌లో ప్రదర్శనలో ఉంచిన ఆయుధాలు, పరికరాలు, వాటి పనితీరు గురించి విద్యార్థులకు వివరించారు. రోల్ ఆఫ్ యూత్ ఇన్ ప్రివెన్షన్ ఆఫ్ సైబర్ క్రైం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సాయుధ దళం శ్రీనివాసరావు, డీఎస్పీలు, సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పులి కాదండోయ్.. మేకపోతు

జీవకోన రాజీవ్‌నగర్‌కాలనీ సమీపంలోని ఓ మాంస దుకాణం వద్ద శనివారం పులితోలు కప్పుకున్నట్లు ఉన్న ఒక మేకపోతు కనిపించింది. చూడ్డానికి అచ్చం పులిలా ఉంది. శరీరమంతా పులిమచ్చలు ఉన్న ఈ మేకపోతు చూపరులను ఆకట్టుకుంది. ఇది శిరోహి జాతి మేకపోతని, ఒకప్పుడు రాజస్థాన్ నుంచి దిగుమతి చేసుకునేవారని, ప్రస్తుతం చుట్టుపక్కల పల్లెల్లోనే లభ్యమవుతున్నాయని దుకాణం యజమాని తెలిపారు.

- తిరుపతి (జీవకోన), ఆంధ్రజ్యోతి











వాన కురిస్తే ప్రకృతి పరవశిస్తుంది. చెట్టూ పుట్టా పిట్టా పురుగూ.. సమస్తమూ సంతోషంతో కళకళలాడుతాయి. శేషాచలం అడవులు అనేకానేక రకాల పక్షులకు ఆవాసాలు. ఈ కొండబారు వెంబడే ఉన్న తిరుపతి నగర పరిసరాల్లోనూ పిట్టలు తారసపడుతూ ఉంటాయి. వాన కురిసి వెలిసిన వేళ.. నగరంలోనూ, శివారు పల్లె ప్రాంతాల్లోనూ ఆంధ్రజ్యోతి తిరుమల ఫొటోగ్రాఫర్ కెమెరా కంటబడ్డ రకరకాల పక్షుల చిత్రాలు ఇవి. రామచిలుకలు, వడ్రంగి పిట్టలు, పిచుకలు, గిజిగాడు, పసలపోలుగాడు.. వంటి ఎన్నో రకాలు సందడిచేస్తూ కనిపించాయి. తడిచిన రెక్కలు ఆరబెట్టుకుంటూ, ఊసులు చెప్పుకుంటూ, గూళ్లు అల్లుకుంటూ.. ఈ అందాల రెక్కల లోకాన్ని మీరూ ఆస్వాదించండి..


- ఆంధ్రజ్యోతి, తిరుమల






విహంగ గానం









కేక పుట్టించిన
మ్యూజిక్ షో





తిరుపతి(కల్చరల్), అక్టోబర్ 25 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ స్టేడియంలో శనివారం జరిగిన యువ గాయకుడు కార్తీక్ మ్యూజిక్ ప్రదర్శన యువతను కేరింతలు పెట్టించింది. అరవాన్ తమిళం, తెలుగులో ఏకవీర సినిమాకు సంగీతం కూడా అందించిన కార్తీక్ పాటలకు యువత భారీగా స్పందించింది. మహాగణపతి ప్రార్థనతో సంగీత విభావరి ప్రారంభమైంది. గజనీ సినిమాలోని ఒక మారు కలిసిన బంధం పాటతో ఉత్సాహం తారస్థాయికి చేరుకుంది. అరరె అరెరే మనసే జారే, ఉసురే పోయెను, సీతాకోకా నచ్చావే వంటి పాటలకు మంచి స్పందన లభించింది. స్టేడియం అంతా యువోత్సాహం కనిపించింది. ముఖ్యంగా యాంకర్ ప్రశ్నలకు యువతీయువకులు ఉత్సాహంగా స్పందించారు. కార్తీక్ పాడిన పాటలను హమ్ చేశారు. రెండు గంటలకు పైగా సాగిన సంగీత విభావరి యువతను ఉర్రూతలూగించిందని చెప్పవచ్చు. కాగా ఏర్పాట్లు సరిగా లేకపోవడంతో ప్రేక్షకులు ఇబ్బంది పడాల్సి వచ్చింది. భారీ ధరలతో టికెట్లు కొన్నవారికి కూడా సరైన సీటింగ్ వసతి లేకపోవడంతో మహిళలు కూడా నిలబడే షో చూడాల్సి వచ్చింది. పార్కింగ్ కోసం సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో ఇబ్బందులు తప్పలేదు. పాసుల విషయంలోనూ గందరగోళం నెలకొంది.

సనాతన ధర్మ పరిషత్‌కు సాధు, సంతుల మద్దతు
తిరుపతిలో మద్యం, మాంసం విక్రయాలను నిషేధించాలని విజ్ఞప్తి

తిరుపతి (కల్చరల్), అక్టోబర్ 26 (ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇటీవల ప్రస్తావిస్తున్న సనాతన ధర్మపరిషత్ ఏర్పాటును స్వాగతిస్తున్నట్లు పలువురు సాధు, సంతులు ప్రకటించారు.తిరుపతిలో శనివారం జరిగిన జాతీయ హిందూ ధార్మిక సదస్సులో పాల్గొన్న ఏపీ సాధుపరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి మాట్లాడుతూ.. హిందూ ధర్మ రక్షణకు, అక్రమ మత మార్పిడుల నివారణకు, ఆలయాల నిర్వహణకు, ధర్మ పరిరక్షణకు సనాతన ధర్మపరిషత్ ఏర్పాటు ఎంతో అవసరమన్నారు. జాతీయ స్థాయిలో ఇటువంటి బోర్డు ఏర్పాటుకు కృషిచేయాలని సాధువులు, పీఠాధిపతులు, మఠాధిపతులు విజ్ఞప్తి చేస్తున్నారని, ఇందుకోసం ప్రయత్నిస్తున్న ఏపీ ఉపముఖ్యమంత్రికి తాము మద్దతుగా నిలుస్తామన్నారు. రాష్ట్రంలో గత పాలకులు ఆలయాలను నిర్వీర్యం చేశారని, ప్రస్తుత ప్రభుత్వం వాటిని చక్కదిద్దేప్రయత్నం చేస్తోందన్నారు. దేవస్థానాల పాలకమండళ్లలో తప్పనిసరిగా సాధువుల నుంచి ఒకరికి సభ్యత్వం ఇవ్వాలని ఆయన డిమాండు చేశారు.ఇతర మతస్తులకు మక్కా, వాటికన్ నగరాల మాదిరిగా హిందువులకు తిరుపతిని పవిత్ర పుణ్యక్షేత్రంగా గుర్తించాలని, ఇక్కడ మద్యం, మాంసం విక్రయాలను పూర్తిగా నిషేధించాలని సదస్సు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. **హిందువులకు వేంకటేశ్వరస్వామి ఆరాధ్య దైవమని, ఆయన సన్నిధిలో అన్యమతస్తులు పనిచేయడాన్ని అరికట్టాలని కోరింది.** ఏపీ సాధు పరిషత్ గౌరవ అధ్యక్షుడు అట్లూరి నారాయణరావు, తెలంగాణ సాధుపరిషత్ అధ్యక్షుడు శివానంద స్వామి, శంకర స్వామి, దేవానంద జీయర్, కామాఖ్యపీఠానికి చెందిన భైరన్ గౌరవ్ స్వామి, నిరంజన్, తుమ్మా ఓంకార్ తదితరులు ప్రసంగించారు. రోజంతా జరిగిన ఈ ధార్మిక సదస్సులో 6 రాష్ట్రాలకు చెందిన మూడు వందలకు పైగా సాధువులు, మఠాధిపతులు, హిందూ ధార్మిక సంస్థల సభ్యులు, భక్తులు, తిరుక్షేత్రాల రక్షణ సమితి సభ్యులు పాల్గొన్నారు.


జాతీయ హిందూ . దార్మిక సదస్సులో పాల్గొన్న సాధు, సంతులు

రేపు జిల్లా ఇన్‌చార్జి మంత్రి తిరుపతి రాక

తిరుపతి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ ఈనెల 28వ తేదీన తిరుపతి రానున్నారు. రెండురోజుల పర్యటనలో భాగంగా సోమవారం తిరుపతి చేరుకోనున్న రెవెన్యూ శాఖ మంత్రి సత్యప్రసాద్ తొలిరోజు కూటమి పార్టీల నేతలతో సమావేశం కానున్నారు. మరుసటి రోజు జిల్లా అభివృద్ధి విషయమై కలెక్టర్‌తో సమీక్షించనున్నారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు తిరుచానూరు రోడ్డులోని గ్రాండ్ రిడ్జ్ హోటల్‌లో జిల్లాకు చెందిన టీడీపీ, జనసేన, బీజేపీల ముఖ్య నేతలు, ఎమ్మెల్యేలతో సమావేశం కానున్నారు. మంగళవారం కలెక్టర్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులతో సమావేశమై అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ప్రాజెక్టులు, నిధుల కేటాయింపు వంటి అంశాలపై దిశా నిర్దేశం చేయనున్నారు.

టీడీపీ కార్యకర్త హత్య కేసులో 14 మంది అరెస్ట్

చిల్లకూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాంచారమ్మపేట గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త హరిప్రసాద్ హత్య కేసులో 14 మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఏఎస్పీ రవిమనోహరచారి శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆ వివరాలు వెల్లడించారు. ఈనెల 22వ తేదీన వేకువన గ్రామానికి చెందిన కొంతమంది వైసీపీ నాయకులు గ్రామంలోని హరిజనవాడకు చెందిన కొంతమందితో కలిసి అరుంధతీయవాడకు చెందిన టీడీపీ కార్యకర్తలైన కాటయ్య, హరిప్రసాద్‌లను హత్యచేసేందుకు కుట్రపన్నారన్నారు. కాటయ్య, హరిప్రసాద్ ఇంట్లో నిద్రిస్తుండగా ఇంటి ముందు ఉన్న మోటారుసైకిల్‌ను పెట్రోలు పోసి తగలబెట్టారన్నారు. కాటయ్య, హరిప్రసాద్ నిద్రిస్తున్న ఇంట్లోకి పెట్రోల్ సీసాలకు నిప్పంటించి వారిపై విసిరి హత్యాయత్నం చేయగా కాటయ్య, హరిప్రసాద్ మంటలను తట్టుకోలేక బయటకు రావడంతో వారిపై కత్తులతో దాడి చేశారన్నారు.


పట్టుపడిన నిందితులతో ఏఎస్పీ రవిమనోహరచారి, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు

కాటయ్య సమీప పొలాల్లోకి పారిపోగా హరిప్రసాద్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడన్నారు. హరిప్రసాద్ హత్యకేసులో నిందితులైన మండలంలోని ముత్యాలపాడు గ్రామానికి చెందిన కట్టా రామిరెడ్డి, నాంచారమ్మపేట గ్రామానికి చెందిన దుంపాల మధుకుమార్, దుంపాల డేనియల్, మన్నెం మోజేస్, ముత్యాలపాడు గ్రామానికి చెందిన చిట్టేటి దినేష్‌రెడ్డి, నాంచారమ్మపేట గ్రామానికి చెందిన మన్నెం శీనయ్య, మన్నెం మనెయ్య, దుంపాల సాయికృష్ణ, పనబాక మనోజ్‌కుమార్, కోట మండలం వంజివాక గ్రామానికి చెందిన పామల విష్ణు, తిమ్మినాయుడుపాళెం గ్రామానికి చెందిన కదూరు విశాల్, అల్లంపాడు గ్రామానికి చెందిన దుంపాల ఏసు, చిల్లకూరు మండలం నాంచారమ్మపేటకు చెందిన దుంపాల చెంగమ్మ, ముత్యాలపాడుకు చెందిన నారపరెడ్డి వెంకట కృష్ణారెడ్డిలను అరెస్ట్ చేశామని వివరించారు. మండలంలోని చింతవరం- కోట రోడ్డులో ఏడుగురిని, ముత్యాలపాడు సమీపంలోని ఏఎంసీ గోదాము వద్ద ఏడుగురిని అరెస్ట్ చేశామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు రమణకుమార్, చెంచుబాబు, సీఐలు కిషోర్‌బాబు, హుస్సేన్‌బాషా, శేఖర్‌బాబు, బాబీ, మురళీకృష్ణ, ఎస్ఐ సురేష్‌బాబు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

గ్రామస్థాయి నుంచి బలోపేతం చేద్దాం : ఎమ్మెల్యే విజయశ్రీ


సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నాయుడుపేట టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేద్దామని ఎమ్మెల్యే విజయశ్రీ పిలుపునిచ్చారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే విజయశ్రీ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. నియోజకవర్గంలో లక్షా 40వేలు సభ్యత్వ నమోదు లక్ష్యంగా పనిచేస్తామన్నారు. టీడీపీ నాయకులు శిరసనంబేటి విజయ భాస్కర్‌రెడ్డి, తిరుమూరు సుధాకర్‌రెడ్డి, రఫీ, కృష్ణయ్య, దేవారెడ్డి నాగేంద్రరెడ్డి, విజయకుమార్‌నాయుడు, అరవ పెరిమిడి చంద్రారెడ్డి, గంగాప్రసాద్, గూడూరు సుధీర్‌రెడ్డి, సుబ్బారావు, నారాయణ, రవి, సుధీర్ ఉన్నారు.

'నీ స్థాయి మరిచి మాట్లాడితే సహించం'

● వైసీపీ నేత కామిరెడ్డికి టీడీపీ శ్రేణుల హెచ్చరికలు


సమావేశంలో మాట్లాడుతున్న సంచి కృష్ణయ్య

పెళ్లకూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): స్థాయిని మరిచి సీఎం చంద్రబాబును, టీడీపీ నేత కొండేపాటి గంగాప్రసాద్‌ను విమర్శిస్తే సహించబోమని వైసీపీ నేత కామిరెడ్డి సత్యనారాయణరెడ్డిని టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య ఘాటుగా హెచ్చరించారు. శనివారం కొత్తూరు టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆ పార్టీ సీనియర్ నాయకులు పాపాడి రాజగోపాల్ రెడ్డి, దామెర ప్రసాద్‌నాయుడు, వట్టికుండల శేఖర్‌నాయుడు, శాఖమూరి కృష్ణమనాయుడు, యాగాని బెన్నీలతో కలసి మాట్లాడారు. గత ఐదేళ్లలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని మట్టి, గ్రావెల్‌ను దోచుకున్న నీలాంటి వారికి చంద్రబాబును విమర్శించే అర్హత లేదన్నారు. దోపిడీ, దౌర్జన్యం, విధ్వంసంతో పాలన సాగించడం తప్ప ప్రజలకు వైసీపీ చేసింది శూన్యమన్నారు. పెళ్లకూరు మండలం టీడీపీకి కంచుకోట అని గతంలో వైసీపీ పాలనలో 12 సర్పంచుల స్థానాలకు 10 మందిని గెలుచుకున్నామని గుర్తుచేశారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో అభ్యర్థులను నామినేషన్ వేయకుండా అడ్డుకున్న విష సంస్కృతి నీదేనని తెలియజేశారు. టీడీపీ నాయకులు మాధవరెడ్డి, మల్లికార్జునరెడ్డి, సిద్ధులయ్య నాయుడు, మురళీ నాయుడు, రవినాయుడు, మునికృష్ణారెడ్డి, యుగంధర్‌గౌడ్, సుబ్రమణ్యంరెడ్డి, శ్రీనివాసులు, ఉదయ్‌నాయుడు, సుబ్రహ్మణ్యం, గురవారెడ్డి, వేణురెడ్డి, గురవయ్య, పరుశురాం, రవి, చంద్రయ్య, జనసేన నాయకుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

వీఎస్‌ఆర్‌లో జంతు దినోత్సవం



గూడూరు అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక వీఎస్‌ఆర్ పాఠశాలలో శనివారం జంతువుల దినోత్సవం నిర్వహించారు. ఎల్‌కేజీ, యూకేజీ చిన్నారులు వివిధ జంతువుల వేషధారణలో దుస్తులు ధరించి నిర్వహించిన ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ బాలకృష్ణంరాజు, అన్నపూర్ణ, శాంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రూరల్ సర్కిల్ కార్యాలయం తనిఖీ

నాయుడుపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : అడిషనల్ ఎస్పీ రవిమనోహర్‌ఆచారి తనిఖీ చేశారు. శనివారం గూడూరు నుంచి తిరుపతికి వెళ్తూ మార్గమధ్యంలో రూరల్ సర్కిల్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, అర్బన్, రూరల్ సీఐలు బాబి, సంగమేశ్వరరావు ఉన్నారు.

బాలుర హాస్టల్ తనిఖీ

తడ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): చిన్నమాంబట్టు బీసీ బాలుర వసతిగృహాన్ని సూళ్లూరుపేట న్యాయమూర్తి అనూష శనివారం తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, వసతులపై ఆరాతీశారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని సూచించారు. మంచి ఫలితాలు సాధించేందుకు కష్టపడి చదివి ఉన్నతస్థాయికి చేరాలని విద్యార్థులకు సూచించారు.

కార్యకర్తల సంక్షేమమే టీడీపీ లక్ష్యం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తల సంక్షేమం కోసం పాటుపడే ఏకైక రాజకీయ పార్టీ తెలుగుదేశమేనని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ఉన్న ఓటర్లలో ప్రతి నలుగురిలో ఒకరు తప్పనిసరిగా టీడీపీ సభ్యత్వం తీసుకునేలా క్లస్టర్ ఇన్‌చార్జులు కృషిచేయాల న్నారు. ఈ కార్యక్రమంలో పెంచలకోన ఆలయ ట్రస్ట్‌బోర్డు మాజీ చైర్మన్ తానంకి నానాజీ, శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, దశరథ రామిరెడ్డి, అబ్దుల్‌రహీం, వెంకటేశ్వర్లురాజు, బిల్లు చెంచురామయ్య, వాటంబేడు శివకుమార్, పుట్టి వెంకటేశ్వర్లు నాయుడు, పెంచలయ్య, కోటేశ్వరరావు, నరసిం హులు, జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

రక్తదానం మరొకరికి ప్రాణ దానం : ఎమ్మెల్యే కురుగొండ్ల



రక్తదానం చేసిన కానిస్టేబుల్‌కు జ్యూస్ అందిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో పోలీసులు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రక్తం దానం చేసిన 103 మందిని, రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసిన సీఐ రమణను, ఎస్‌ఐ సుబ్బారావు, పోలీస్ సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీరామదాసు గంగాధర్, పప్పు చంద్రమౌళిరెడ్డి, పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, అవ్వారు సత్యనారాయణ, కేవీకే ప్రసాద్‌నాయుడు, భీరం రాజేశ్వరావు, కాపా శ్రీనివాసుల నాయుడు, తాండవ చెంద్రారెడ్డి, నరసింహులు, సుదా, మల్లారం బాబు, చెంగారావు, జనసేన పార్టీ నాయకులు తోటా రామచంద్రయ్య, కస్తూరి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

గూడూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఏడవ అదనపు జిల్లా జడ్జి షమ్మీపర్వీన్‌సుల్తానాబేగం అన్నారు. శనివారం స్థానిక బీసీ బాలికల గురుకుల పాఠశాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయవాదులు అరవ పార్వతయ్య, కోటేశ్వరరావు, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని రిక్షా కార్మికుడి మృతి

నాయుడుపేట టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : నాయుడుపేట పట్టణం తుమ్మూరు సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని రిక్షా కార్మికుడు సుబ్రహ్మణ్యం (50) మృతిచెందాడు. సంజాయ్ గాంధీ కాలనీకి చెందిన సుబ్రహ్మణ్యం శనివారం రాత్రి రోడ్డుపక్కన నడిచి వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. పోలీసులు కేసు నమోదు చేశారు.

టపాకాయల అంగళ్లకు అనుమతి తప్పనిసరి

ఓజిలి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : అనుమతి లేకుండా ఎవరైనా టపాకాయల అంగళ్లు నిర్వహిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ స్వప్న హెచ్చరించారు. ఓజిలిలో శనివారం ఆమె మాట్లాడుతూ దీపావళికి టపాకాయల అంగళ్లు పెట్టాలనుకున్న వారు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని ఆమె సూచించారు. లైసెన్సు తీసుకున్న వారు సురక్షిత ప్రాంతాలలోనే దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

పుత్తూరు వార్తలు

అన్ని వర్గాలకూ టీడీపీ సముచిత స్థానం

● టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో గంజి మాధవయ్య



పుత్తూరు అర్బన్, అక్టోబర్ 26(ఆంధ్రజ్యోతి): రాజకీయంగా అన్ని వర్గాల వారికి సముచిత స్థానం కల్పించిన ఏకైక పార్టీ టీడీపీ అని రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య పేర్కొన్నారు. శనివారం గోపాలక్రిష్ణ పురంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. సభ్యత్వం పొందిన పార్టీ శ్రేణులకు గుర్తింపు కార్డులు అందజేశారు. పుత్తూరు రూరల్ ప్రధాన కార్యదర్శి బాలాజీ, టీడీపీ నాయకులు గంగయ్య, హేమంత్, హరిగోపాల్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు. గేటు పుత్తూరు వినాయక గుడి వద్ద సభ్యత్వ నమోదు కార్యక్రామాన్ని పట్టణ పార్టీ అధ్యక్షులు జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్.ఎన్.ధనపాల్ ప్రారంభించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ కరుణాకరన్, యుగంధర్, డి.ఎన్.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు గదుల ప్రారంభం


అదనపు గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం, అక్టోబర్ 26(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయంలో అదనపు గదులను శనివారం ఎమ్మెల్యే ఆదిమూలం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంపీడీవో గదులతో విధుల నిర్వహణ సులభతరం అవుతుందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు సహకారంతో సత్యవేడు నియోజకవర్గంలో మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. నారాయణవనం కూడలి వద్ద అంబేద్కర్ విగ్రహం నుంచి బైక్ పై ర్యాలీగా వచ్చారు. జడ్పీటీసీ సుమన్‌కుమార్, ఎంపీపీ దివాకర్ రెడ్డి, వైస్ ఎంపీపీ శివశంకర్, టీడీపీ నాయకులు ఆర్‌డి ఏకాంబరం, గోవిందస్వామి, రవి రెడ్డి, గాండ్ల శివకుమార్, కందస్వామినాయుడు, గోవిందశెట్టి, ఎంపీటీసీలు,, సర్పంచులు పాల్గొన్నారు.

వైభవంగా కళ్యాణ వెంకన్న ఊయలసేవ

నారాయణవనం, అక్టోబర్ 26(ఆంధ్రజ్యోతి): నారాయణవనంలోని శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం కళ్యాణ వెంకన్న ఊయల సేవ వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి, నిత్యకైంకర్యాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు శ్రీధర్ భట్టాచార్య ఊంజల సేవ ను నిర్వహించారు. భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు.

విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్జి రాఘవేంద్ర

పుత్తూరు టౌన్, అక్టోబర్ 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌సీ రాఘవేంద్ర తెలిపారు. శనివారం గోపాలకృష్ణాపురం అంబేడ్కర్ గురుకుల వసతి గృహాన్ని ఆయన పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. వసతి గృహం గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రకళ, ఉపాధ్యాయులు, న్యాయవాదులు మురుగేషన్ రెడ్డి, గాలి సురేష్ బాబు, కోర్టు సిబ్బందులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బాధ్యతల స్వీకరణ



పుత్తూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా శనివారం డాక్టర్ చంద్రమౌళి బాధ్యతలు స్వీకరించారు. ఆయన విశాఖపట్నం నుంచి పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పుష్పగుచ్ఛంతో అభినందించారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న చంద్రమౌళి

నీటి పన్ను చెల్లించండి : కమిషనర్



సూళ్లూరుపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని నీటి కుళాయి పన్నును అందరూ సకాలంలో చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య తెలిపారు. శనివారం ఆయన సాయినగర్, కసారెడ్డిపాలెం తదితర ప్రాంతాల్లో కుళాయి కనెక్షన్లను పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా కనెక్షన్లు ఉంటే తొలగిస్తామని హెచ్చరించారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



తడ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పెదమాంబట్టు గ్రామంలో ఉన్న శ్రీకృష్ణమందిరంలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. శనివారం తెల్లవారుజామున స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం కుంభాభిషేకం, పూర్ణాహుతి నిర్వహించి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి సిమ్స్ వైద్యులు కె. మునస్వామి, గ్రామ పెద్దలు వేనాటి రాజారెడ్డి, సురేష్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన కొండేపాటి, వాకాటి



సూళ్లూరుపేట, అక్టోబరు 26: ప్రముఖ పారిశ్రామిక వేత్త, టీడీపీ నేత కొండేపాటి గంగాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకాటి నారాయణ రెడ్డి శనివారం అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబును మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజక వర్గంలో తాజా రాజకీయ పరిస్థితులు, నామి నేటెడ్ పదవులు, నియోజక వర్గ అభివృద్ధి తదితర వాటిపై చర్చించినట్లు తెలిసింది.

కర్ణాటకలో పేదల డబ్బు పక్కదారి


మీడియాతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి శోభ కరంద్లజే

తిరుమల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): 'కర్ణాటక పరిస్థితి అస్సలు బాగోలేదు. ఏడాదిన్నరగా అక్కడున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టడం లేదు, పేదలకు ఉపయోగించాల్సిన డబ్బు పక్కదారి పడుతోంది' అని కేంద్రమంత్రి శోభ కరంద్లజే అన్నారు. తిరుమల శ్రీవారిని శనివారం దర్శించుకున్న ఆమె ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం ప్రగతివైపు పరుగులు తీస్తోందన్నారు. దీనికి భగవంతుడి ఆశీస్సులు కూడా కావాలని కోరుకున్నట్టు తెలిపారు. కర్ణాటక ప్రభుత్వంలో భారీ అవినీతి జరుగుతోందన్నారు. అందుకే అక్కడ భవనాలు కూలిపోతున్నాయని, మనుషులు చనిపోతున్నారని అభిప్రాయపడ్డారు. ఉన్న డబ్బులన్నీ హామీల అమలుకోసం ఖర్చు పెట్టేశారని, ఇప్పుడు అవి కూడా అమలుకావడం లేదన్నారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

బాలికకు ఆర్థికసాయం



నారాయణవనం, అక్టోబర్ 26(ఆంధ్రజ్యోతి): నారాయణవనం మండలం ఎగువబొప్పరాజపాలెంలో ఇటీవల ఆలయ ప్రహరీ గోడ కూలి గాయపడిన చిన్నారి రచనకు వడమాలపేట టోల్ ప్లాజా కార్మిక సంఘం ఆర్థిక సాయమందించింది. టోల్‌ప్లాజా కార్మికులు శనివారం రూ.55000 వైద్యఖర్చుల కోసం కుటుంబసభ్యులకు అందజేశారు. సహాయం అందించిన వారిలో జయకుమార్, శ్రీనివాస్, హరికృష్ణ, పెరుమాల్, ధనంజయలు ఉన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు ప్రారంభం


కల్లూరులో సభ్యత్వ నమోదులో టీడీపీ నాయకులు

వడమాలపేట, అక్టోబర్ 27(ఆంధ్రజ్యోతి):మండలంలో టీడీసీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయులునాయుడు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో స్పందన బాగుందని చెప్పారు. పార్టీ నాయకులు హేమావతి, మోహన్, అంజయ్య, గజేంద్ర, శివ, రామానాయుడు, హరి, అదెయ్య తదితరులు పాల్గొన్నారు.

సర్వీసు రోడ్లను పట్టించుకోరా..!

వడమాలపేట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తిరుపతి -చెన్నై జాతీయ రహదారి నుంచి ఎస్వీపురం టోల్ ప్లాజా మీదుగా వడమాలపేటకు వెళ్లే సర్వీసు రోడ్డు పట్ల జాతీయ రహదారుల సంస్థ అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు. అలాగే వడమాలపేట నుంచి ఎస్వీపురం మీదుగా టోల్‌గేట్ సమీపంలో తిరుపతికి వెళ్లే ఇరుకైన సర్వీస్ రోడ్డుతో వాహన దారులు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా వడమాలపేటకు వెళ్లే సర్వీస్ రోడ్డు గుంతలతో ఇరుకు రోడ్డుగా ఉంది. బస్సులు, కార్లలో వెళ్లేవారు సర్వీస్ రోడ్డు మీదుగా వెళ్లడానికి ఇరుకు, గుంతల రోడ్డుతో భయపడుతున్నారు. లైట్లు లేక పోవడంతో చీకట్లో జాతీయ రహదారిలోనికి ప్రవేశించాలంటే వాహన దారులు భయం గుప్పిట్లో ప్రయాణిస్తున్నారు. జాతీయ రహదారుల సంస్థ అధికారులు సర్వీస్ రోడ్లను బాగుచేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



టోల్ గేట్ మీదుగా వడమాలపేటకు వెళ్లే సర్వీస్ రోడ్డు ● వడమాలపేట నుంచి జాతీయ రహదారి మీదుగా ప్రవేశించే ఇరుకు రోడ్డు

మద్దాలిలో పల్లె పండుగ


జంతుశాల షెడ్‌కు భూమిపూజ చేస్తున్న జేఈ సతీష్

కోట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మద్దాలిలో శనివారం పల్లెపండుగ వారోత్సవాలు జరిగాయి. మినీగోకులాల పని తీరును పరిశీలించారు. ఉపాధి హామీ పథకం క్వాలిటీ కంట్రోల్ జేఈ సతీష్‌బాబు, ఏపీవో పూర్ణిమ, ఎంపీడీవో వేణు ఆయా పనులను పరిశీలించారు. యానిమల్స్ షెడ్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. స్థానిక గిరిజన కాలనీలో ఉన్న సీసీ రోడ్డును ప్రారంభించారు.

బైక్‌ను ఢీకొన్న బస్సు..యువకుడికి గాయాలు

కోట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : కోటకు చెందిన యువకుడు విద్యానగర్ పెట్రోలు బంకు సమీపంలో వెళ్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొంది. యువకుడికి స్వల్పగాయాలయ్యాయి. అతడిని కోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వివరాలు తెలియాల్సి ఉంది.

లక్ష్యసాధనకు ప్రతి కార్యకర్తా కృషిచేయాలి


సభ్యత్వ నమోదును ప్రాంభిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు లక్ష్యసాధనకు ప్రతి ఒక్క కార్యకర్తా కృషిచేయాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం ఆయన పార్టీ కార్యాలయంలో సభ్యత్వ నమోదును ప్రారంభించారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ


మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి శ్రీనివాసులు

కోట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ప్రకృతి వ్యవసాయంపై అంగన్వాడీ వర్కర్లకు శిక్షణ జరిగింది. కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లోని వర్కర్లకు, సేంద్రియ ఎరువుల వాడకం, దిగుబడులపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం మోడల్ మేకర్ శ్రీనివాసులు, రాంబాబు, భాగ్యలక్ష్మి, భాగ్యమ్మ, శివకుమారి, సీడీపీవో మునికుమారి ఉన్నారు.

పోలీస్ స్టేషన్‌లో రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న పోలీసులు

సూళ్లూరుపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకొని సూళ్లూరుపేట పోలీస్‌స్టేషన్‌లో శనివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. సేవా బ్లడ్ బ్యాంక్, పోలీసుల ఆధ్వర్యంలో జగిరిన రక్తదాన శిబిరాన్ని సీఐ మురళికృష్ణ ప్రారంభించారు. పోలీసు సిబ్బందితో పాటు కళాశాల విద్యార్థులు, ఆటో వర్కర్స్ పలువురు స్వచ్ఛంగా రక్తదానం చేశారు. ఎస్‌ఐలు బ్రహ్మనాయుడు, శ్రీకాంత్, సేవా బ్లడ్‌బ్యాంక్ నిర్వాహకులు భాస్కర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఓజిలిలో టీడీపీ సభ్యత్వాల నమోదుకు సన్నాహాలు

ఓజిలి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఓజిలి మండలంలో టీడీపీ సభ్యత్వ నమోదుకు సన్నాహాలు చేస్తున్నట్లు మండల టీడీపీ కన్వీనరు గుజ్జలపూడి విజయకుమార్‌నాయుడు శనివారం తెలిపారు. నియోజకవర్గం ఇన్‌చార్జి నెలవల సుబ్రమణ్యం సూచనల మేరకు ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ఆదేశాలతో క్లస్టర్ ఇన్‌చార్జిలు, గ్రామ కమిటీలను సభ్యత్వాల నమోదులో భాగస్వామ్యం చేస్తున్నామన్నారు. గ్రామాల వారీగా సభ్యత్వాలను త్వరగా పూర్తి చేసేందుకు మండల కమిటీ గ్రామ కమిటీలతో సమేకమై పనిచేస్తుందని వివరించారు.

ఆగమోక్తంగా శనీశ్వరస్వామికి తైలాభిషేకం

శ్రీకాళహస్తి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలోని శనీశ్వరస్వామికి శనివారం ఆగమోక్తంగా పూజలు నిర్వహించారు. కలశ ప్రతిష్ఠ చేసి మొదట గణపతి పూజ, కలశ పూజను చేశారు. నువ్వుల నూనె, మంచినూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని పలు పుష్పాలతో విశేషంగా అలంకరించారు. విశేష పూజలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

● శ్రీకాళహస్తీశ్వరాలయంలోని అభయ శ్రీవెంకటేశ్వరస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రకాల అభిషేకాలు చేశారు. నగలు, పుష్పాలతో సుందరంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు.

వాహనాల సీజ్



శ్రీకాళహస్తి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పన్నులు చెల్లించని వాహనాలను సీజ్ చేస్తామని మోటారు వాహనాల తనిఖీ అధికారి దామోదరనాయుడు తెలిపారు. శ్రీకాళహస్తి రవాణాశాఖ పరిధిలో చాలా వాహనాలు ఇలా తిరుగుతున్నాయన్నారు. వాణిజ్య అవసరాలకు వాడే ట్రక్టర్లు, ట్రైలర్స్ సుమారుగా 600 వాహనాలకు పన్నులు చెల్లించకుండా ఉన్నట్లు గుర్తించామన్నారు. శనివారం రెండు వాహనాలను సీజ్ చేసి రూ.65 వేలు జరిమానా విధించారు.

ఇసుక మాఫియాకు వ్యతిరేకంగా సీఐటీయూ నిరసన

శ్రీకాళహస్తి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు వేరైనా మట్టి మాఫియా ఒక్కటేనని కార్మికసంఘాల నాయకులు విమర్శించారు. సీఐటీయూ కార్యాలయంలో కార్మికసంఘాల సమావేశం జరిగింది. సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య, ఏఐటీయూసీ ఏరియా అధ్యక్షుడు వైఎస్ మణి మాట్లాడుతూ తొట్టంబేడు మండలంలో ఇసుక, మట్టి మాఫియా పెట్రేగిపోతోందన్నారు. మాఫియా నేతలపై కూటమి నేతలు పీడీ యాక్టు ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుక ట్రాక్టరు ఢీకొని మరణించిన రాజేంద్ర, చైతన్యకుటుంబానికి రూ.50లక్షలు నష్టపరిహారం, సాగు భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇసుక, మట్టి మాఫియాకు వ్యతిరేకంగా కరపత్రాలను విడుదల చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పుల్లయ్య, గంధం మణి, కుమార్, వెంకటేష్,అన్వర్‌బాషా, వెంకటేశ్వర్లు, గురవయ్య, జాకీర్ పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

సత్యవేడు, అక్టోబరు 26: నాగలాపురం మండలం అరుణా నది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న 11 ట్రాక్టర్లను అధికారులు పట్టుకున్నారు. జరిమానా విధించారు. నందనం, కారణి తదితర ప్రాంతాల్లోట్రాక్టర్ల ద్వారా అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని అందిన సమాచారం మేరకు నాగలాపురం ఎస్సై సునీల్ తమ సిబ్బందితో కలిసి రీచ్‌కు వెళ్ళి దాడులు నిర్వహించారు. 11 ట్రాక్టర్లను పట్టుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. ట్రాక్టర్‌కు రూ. 5 వేలు చొప్పున 10 ట్రాక్టర్లకు జరిమానా విధించారు. ఒక ట్రాక్టర్‌కు అనుమతులు ఉండడంతో జరిమానా విధించలేదని ఇన్‌చార్జి తహసీల్దార్ లావణ్య తెలిపారు.

ముక్కంటి సేవలో నందమూరి రామకృష్ణ



శ్రీకాళహస్తి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): టీడీటీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ తనయుడు నందమూరి రామకృష్ణ శనివారం శ్రీకాళహస్తీశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, టీడీపీ నాయకులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. టీడీపీ నాయకులు విజయనాయుడు, చెంచయ్యనాయుడు, మునిరాజాయాదవ్ పాల్గొన్నారు. **గుడిమల్లం పరశురామేశ్వరస్వామిని నందమూరి రామకృష్ణ దర్శించుకున్నారు.**

హుండీచోరీకి విఫలయత్నం

శ్రీకాళహస్తి అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): విజ్ఞానగిరిపై హుండీ చోరీకి గుర్తు తెలియని దొంగలు విఫలయత్నం చేశారు. పట్టణంలోని విజ్ఞానగిరి కొండపై శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహించే ఆలయంలో శుక్రవారం రాత్రి హుండీ తాళాలను దొంగలు కోసే ప్రయత్నం చేశారు. విఫలం కావడంతో పారిపోయారు. శనివారం ఉదయం ఈ విషయం గుర్తించిన ముక్కంటి ఆలయ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఉత్సాహంగా టీడీపీ సభ్యత్వ నమోదు





కమ్మకొత్తూరులో సభ్యత్వ నమోదు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి- ఎస్సీవీ నాయుడు నుంచి శాశ్వత సభ్యత్వం స్వీకరస్తున్న ప్రకాష్‌నాయుడు

శ్రీకాళహస్తి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వం పొందిన ప్రతి ఒక్కరూ క్రమశిక్షణకు నిదర్శనమని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. కమ్మకొత్తూరులో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన శనివారం లాంఛనంగా ప్రారంభించారు. అకుర్తి, రేణిగుంటల్లో సభ్యత్వ నమోదుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.100తో సభ్యత్వం పొందిన వారందరికీ ప్రమాద బీమా రూ.5లక్షలు వర్తిస్తుందని చెప్పారు. టీడీపీ నాయకులు విజయకుమార్, చెంచయ్యనాయుడు, కంఠా రమేష్, ప్రతాప్‌రెడ్డి, జయచంద్రనాయుడు, సుజిత్ తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని స్వగృహం వద్ద మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీనాయుడు సభ్యత్వ నమోదుకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో నాయకులు సత్రవాడ ప్రవీణ్, నారాయణయాదవ్, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. తిరుపతి పార్లమెంటు రైతు ఉపాధ్యక్షుడు ప్రకాష్‌నాయుడు రూ.లక్ష నగదును చెల్లించి శాశ్వత సభ్యత్వం స్వీకరించారు.

● బుచ్చినాయుడుకండ్రిగ: కాటూరులో సభ్యత్వ నమోదును మండల టీడీపీ అధ్యక్షుడు సుధాకర్ నాయుడు ప్రారంభించారు. మొదటి సభ్యత్వాన్ని జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మన్ కన్నయ్య నాయుడు తీసుకున్నారు. పార్లమెంట్ టీడీపీ కార్యదర్శి సుధాకర్ నాయుడు నాయకులు రవినాయుడు, మధునాయుడు, శ్రీనివాసులు, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

● కేవీబీపురం: అంజూరు పంచాయతీ నుంచి మండలాధ్యక్షుడు రామాంజులనాయుడు, పార్లమెంటరీ రైతు సంఘ అధ్యక్షుడు గోపీనాథరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. కేవీబీపురంలో రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి మునస్వామియాదవ్ ప్రారంభించారు.

● వరదయ్యపాళెం: స్థానిక కేబీజీ ప్యాలెస్‌లో మండల టీడీపీ అధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నియోజకవర్గ ఇన్‌ఛార్జి శ్రీపతి నిర్వహించారు. క్లస్టర్ ఇన్‌ఛార్జి నిర్మల్, మండల ప్రధాన కార్యదర్శి దశరథన్, అధికార ప్రతినిధి నాగరాజుయాదవ్, నాయకులు నరసరాజు తదితరులు పాల్గొన్నారు.

● పిచ్చాటూరు: కీళపూడిలోని మాజీ ఎంపీపీ మధుబాల పద్మనాభరాజు గృహంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు సతీష్‌నాయుడు నిర్వహించారు. మండల టీడీపీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, పద్మనాభరాజు, నాయకులు రామకృష్ణంరాజు, సురేష్ బాబు నాయుడు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

● ఏర్పేడు: మండలకేంద్రంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో గాలి కృష్ణవేణి, రాచేటి సుబ్రహ్మణ్యం, నిరంజన్, సదాశంకర్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, గోపి పాల్గొన్నారు.



శాశ్వత సభ్యత్వం తీసుకుంటున్న కొండూరు బాలరాజు

● సత్యవేడు: నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీపతి బాబు నేతృత్వంలో సత్యవేడులో సభ్యత్వ నమోదు నిర్వహించారు. పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు కొండూరు బాలరాజు రూ.లక్ష చెల్లించి శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. ప్రవీణ్‌కుమార్ రెడ్డి, పరమశివం తదితరులు పాల్గొన్నారు

వరిపంటకు నీరందించి ఆదుకోండి

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రధాన తెలుగుంగ 8బి కాలువ ద్వారా కేవీబీ పురంలోని పడమటి, ఉత్తరపు, దిగువ, దరఖాస్తు, మదరవాడలోని రెండు చెరువులకు తెలుగుగంగ నీరును అందించాలని జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మన్ కన్నయ్య నాయుడు కోరారు. ఆయన ఆధ్వర్యంలో రైతులు తెలుగుంగ డీఈ పెంచలయ్యకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ చెరువుల కింద 600 ఎకరాల్లో నీరు లేక వరిపంట ఎండిపోతోందన్నారు. అధికారులతో మాట్లాడి నీరు అందించేలా చూస్తామని డీఈ వీరికి చెప్పారు.

సమాచార హక్కు చట్టంపై రైతులకు అవగాహన

బుచ్చినాయుడుకండ్రిగ, 26: (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో రైతులకు సమాచార హక్కు చట్టంపై శనివారం అవగాన కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి భారతి మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అందించే విత్తనాలు, పనిముట్ల రాయితీ గురించి సమాచార హక్కు చట్టం ద్వారా తెలుసుకోవచ్చునన్నారు. పథకాల గురించి వివరాలు తెలుసుకోవచ్చన్నారు. ఈ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి సబ్‌జైలు తనిఖీ



భోజన నాణ్యతను పరిశీలిస్తున్న న్యాయమూర్తి బేబీరాణి

శ్రీకాళహస్తి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సబ్‌జైలును శనివారం శ్రీకాళహస్తి న్యాయస్థాన సీనియర్ సివిల్ జడ్జి బేబీ రాణి తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి ఖైదీలకు హక్కుల గురించి వివరించారు. భోజనాన్ని రుచి చూశారు. ఆహార సరుకులను పరిశీలించారు. న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాస్ ఆధ్వర్యంలో ఘనంగా దసరా పూజలు

శ్రీకాళహస్తి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాస్ కార్యాలయంలో రాస్ పొదుపు సంఘాల సలహా కమిటీ లీడర్లు, సిబ్బంది నడుమ భక్తిశ్రద్ధలతో దసరా పూజలను నిర్వహజంచారు. పొదుపు సంఘాల సంచాలకులు నాగరాజు మాట్లాడుతూ సంస్థ కార్యకలాపాల గురించి వివరించారు.

చెంచులక్ష్మి సమేత నరసింహస్వామి విగ్రహాల ప్రతిష్ట

బుచ్చినాయుడుకండ్రిగ, 26: (ఆంధ్రజ్యోతి): కాటూరులో శ్రీచెంచులక్ష్మి అమ్మవారు సమేత నరసింహస్వామి విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు నవగ్రహాలను ఏర్పాటు చేసి హోమాలు పూజలు చేశారు. అభిషేకానంతరం పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్థులు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

పిల్లల పెంపకంపై తల్లులకు అవగాహన

ఏర్పేడు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్లిలల పెంపకంలో పాత్రపై మహిళలకు ఎస్‌వోఎస్ అవగాహన కార్యక్రమం శనివారం కల్పించింది. ఈ సందర్భంగా కౌన్సిలర్ ప్రతిమ మాట్లాడుతూ తల్లి తమ. పిల్లలను చిన్న వయసు నుంచే సరైన మార్గంలో నడిపించడానికి తగు సూచనలు ఇస్తే మంచి భవిష్యత్తును అందించగలరన్నారు. ఎస్‌వోఎస్ లోకేషన్ ఇన్‌ఛార్జి సత్యనారాయణ, మునిరత్నం, అనిమేటర్లు,140మంది మహిళలు పాల్గొన్నారు.

సంఘమిత్ర ఆత్మహత్యాయత్నం

శ్రీకాళహస్తి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలం తాటిపర్తి పంచాయతీ సంఘమిత్రగా పనిచేస్తున్న రేవతి(40) ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గత కొద్దిరోజులుగా తనను ఉద్యోగం నుంచి కొందరు తొలగించే ప్రయత్నం చేస్తున్నారని, తనపై వేధింపులు మానుకోవాలంటూ ఆమె శనివారం ఆమె సెల్ఫీవీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. 16 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న తనపై వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేసింది. పురుగుల మందుతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లుగా కుటుంబసభ్యులు తెలిపారు. రేవతిని చికిత్సకు శ్రీకాళహస్తి పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు.

చింతలపాళెంలో మళ్లీ తలెత్తిన భూ వివాదం



షికారిలు, రైతుల వాగ్వాదం

శ్రీకాళహస్తి అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం చింతలపాళెం పంచాయతీలో 20 ఏళ్లుగా రైతులు, షికారీలు మధ్య జరుగుతున్న భూసమస్య మళ్లీ మొదలైంది. దున్నకాలు చేపట్టడానికి శనివారం పొలాల్లోకి వెళ్లి రైతులను షికారీలు అడ్డుకున్నారు. వివాదం తలెత్తిన క్రమంలో షికారీలు 100కు ఫోన్ చేసి తమకు రైతుల నుంచి రక్షణ కల్పించాలని కోరారు. పోలీసులు చింతలపాళెం పొలాల వద్దకు చేరుకుని ఇరువర్గాలకూ సర్దిచెప్పి పంపేశారు. భూసమస్య కోర్టులో నడుస్తోందని ఎవరూ ప్రవేశించడానికి లేదని పోలీసులు చెప్పారు.

ఉచిత వైద్య శిబిరం

పిచ్చాటూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కీళపూడి కమ్యూనిటీ భవనం వద్ద శనివారం జరిగిన ఉచిత వైద్య శిబిరానికి స్థానికుల నుంచి స్పందన లభించింది. పరమేశ్వర మంగళం వద్ద ఉన్న ఆస్పత్రి వైద్య బృందం, మాజీ డీఎంహెచ్‌వో సరళాదేవి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. శస్త్ర చికిత్సలు అవసరమైన రోగులకు తమ ఆస్పత్రిలో ఉచితంగా వైద్యం నిర్వహిస్తామని రెఫర్ చేశారు. వైద్యబృందానికి మాజీ ఎంపీపీ మధుబాల, పద్మనాభరాజు, రామకృష్ణంరాజు అభినందనలు తెలిపారు.

కరాటే విజేతలకు సర్టిఫికెట్లు

సత్యవేడు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మినీ క్రికెట్ స్టేడియంలో నిర్వహించిన కరాటే గ్రేడింగ్ పోటీలలో విజేతలైన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందించారు. పట్టణంలోని భువనేశ్వర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో శనివారం పోటీలు జరిగాయి. పోటీల్లో 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఒకటవ బ్లాక్‌బెల్ట్ కరాటే విజేతలుగా పదిమంది, రెండవ బ్లాక్ బెల్ట్ విజేతలుగా ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు అకాడమీ మాస్టర్ భువనేశ్వర్ తెలిపారు. విజేతలైన విద్యార్థులకు జపాన్ 9వ కరాటే బ్లాక్‌బెల్ట్ మాస్టర్ వతనాబి, ఏడవ బ్లాక్‌బెల్ట్ మాస్టర్ రాబర్ట్ మిల్లర్ విల్సన్ సర్టిఫికేట్లు అందించారు.

తుడా భూముల పరిశీలన



భూములను పరిశీలిస్తున్న ఆర్డీవో రామ్మోహన్

వడమాలపేట, అక్టోబర్ 26(ఆంధ్రజ్యోతి):ఎస్వీపురం రెవెన్యూ పరిధిలో గత వైసీపీ ప్రభుత్వం తుడాకు బదిలీ చేసిన భూములను ఆర్‌డీవో రామ్మెమన్ పరిశీలించారు. అంజేరమ్మ కనుమ వద్ద సర్వే నెంబర్ 428,411ల్లో సుమారు 30 ఎకరాలను గత వైసీపీ ప్రభుత్వం తుడాకు స్వాధీనం చేసింది. దీనిపై ఎమ్మెల్యే భాను ప్రకాష్ ముఖ్యమంత్రి కార్యాలయానికి నివేదిక అందజేశారు. దీంతో ఆర్డీవో వచ్చి పరిశీలించారు. ఎంఐజీ పేరుతో హౌసింగ్ లేఅవుట్‌ల కోసం సంబంధింత భూమిని ధారాదత్తం చేశారు. ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో భూములను ఆర్డీవో పరిశీలించారు. ఆర్డీవో మాట్లాడుతూ హౌసింగ్ లే అవుట్‌ల కోసం తుడాకు స్వాధీనం చేసినా ఎలాంటి కదలికా లేదని ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు చెప్పారు.

బహిరంగ ప్రకటన

బందుమూలముగా నా క్లయింట్ M/s. Shriram Finance Ltd., Tirupati-2 బ్రాంచి మేనేజర్ వారు ఇచ్చిన ...

SCHEDULE

...

A.Ananda Kumar, M.Sc., M.A., B.L., Advocate, Opp.Cotton Mill, Renigunta road, Tirupati, Cell: 98665 09592

బహిరంగ ప్రకటన

బందుమూలముగా నా క్లయింట్ M/s. Shriram Finance Ltd., Tirupati-2 బ్రాంచి మేనేజర్ వారు ఇచ్చిన ...

SCHEDULE

...

A.Ananda Kumar, M.Sc., M.A., B.L., Advocate, Opp.Cotton Mill, Renigunta road, Tirupati, Cell: 98665 09592

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

తిరుపతి - 9703618708, 9030367766, 9703618705, 9703618710, 9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లె - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

వాటర్ ప్రూఫింగ్
స్లాబ్ లీకేజీలు, బాత్రూమ్ లీకేజీలు, వాటర్ ట్యాంక్ లీకేజీలు, గోడ చెమ్మలకు పగలకొట్టకుండా గ్యారంటీగా వర్క్ చేయబడును. సంప్ర. : సెల్ : 93465 40767 AJT - 4435

TO-LET
తిరుపతి, డిఫెన్స్ కాలనీ, కపిలతీర్థం-అలిపిరి రోడ్డు ప్రక్కన, 2 BHK గ్రౌండ్ ఫ్లోర్ ఇల్లు అద్దెకు ఇవ్వబడును. సంప్రదించండి. సెల్: 9948171811. AJT - 10884

WANTED
Wanted Tele Callers/Marketing Officers / Team Leaders, Salary Rs. 20,000/- pm + Incentives upto Rs.25,000/-, RKC Group: 8801501376, 8801502343. AJT - 4404

PLOTS FOR SALE
తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయం దగ్గర TCL కంపెనీకి ఎదురుగా తక్కువ బడ్జెట్కే తుడా ఫైనల్ అప్రూవల్ ప్లాట్స్ అందుబాటులో కలవు. 82470 75857, 94943 92069 AJT - 4429

WANTED
బోత్ హాస్పిటల్, కొర్లగుంట, తిరుపతి నందు పనిచేయుటకు వార్డు బాయ్స్ కావలెను. నైట్ డ్యూటీ సెక్యూరిటీ గార్డ్, వంట మనిషి (ఆడ) కావలెను. సెల్ : 99494 23941, 81254 62933. AJT - 4431

PLOTS FOR SALE
రంగంపేట మోహన్ బాబు యూనివర్సిటీకి ఎదురుగా దాలర్స్ 15 లో 122 (55 అంకణాలు) ఈస్ట్ ఫేసింగ్, తుడా అప్రూవల్ గల ప్లాట్ అమ్మబడును. 1 అంకణం 78000 రూ మాత్రమే . సెల్: 99660 66111 AJT - 4428

WANTED
Telesales Persons from Tirupati, Females work from home,willing to work hard required for a Temporary Project. Contact : 85009 60577 AJT - 4422

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్ పేమెంట్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్ట్మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: 7382114647 AJA- 198455

చిత్తూరు రియల్ ఎస్టేట్స్
చిత్తూరు - బెంగుళూరు బైపాస్ రోడ్డు, బాస్ హోటల్ సర్కిల్‌లో తూర్పు ముఖం కలిగిన 40x110 అడుగుల కమర్షియల్ స్థలం అమ్మకానికి కలదు. సంప్ర. : 8106303584 AJT - 196727

HOUSE FOR SALE
తిరుపతి, శ్రీవారి పాదాలచెంత అవిలాల పంచాయతీ నందు తూర్పు ముఖం వె.20 X పొ.27తో 47 అం॥ల కట్టబడి కల్గిన బెంగుళూరు మోడల్ న్యూ డూప్లెక్స్ హౌస్ 72 లక్షలకు అమ్మబడును. సెల్ : 9908324579 AJT - 4434

PLOTS FOR SALE
36 months EMI Plots for Sale. Near Yerpedu IIT, IISER & IT Hub, Final Approved & Spot Registration. RKC Developers : 88015 01376. AJT - 4405

PLOTS FOR SALE
నేషనల్ హైవేలో ఏర్పేడు వెంకటగిరి రోడ్లో ఐఐటికి ఎదురుగా తుడ అప్రూవ్డ్ ప్లాట్లు స్పాట్ రిజిస్ట్రేషన్ చేసుకున్నవారికి దీపావళి ఆఫర్. 2గ్రా, గోల్డ్ కాయిన్. 95027 74175 / 74162 11984. AJT - 4412

WANTED
WANTED Accounts Assists. - B.Com / M.Com graduates with Tally & MS Offie to work at Auditor's office,Chittoor- M.Keasavulu Naidu, Auditor, Chittoor Cell : 94407 37757 AJT - 4513

LEASE / RENT
తిరుపతి జీవకోన 60' రోడ్డు No 21-8-404, G+2 భవనము (1900 X 3 చ అ) అన్ని వ్యాపారములు, ఆఫీసులు, కాలేజీ, విద్య, వైద్య సంస్థలకు అనుకూలం సంప్ర:99633 52172 AJT - 4335

NEUROLOGIST
డా.కె.నిరంజన్ బాబు, M.D (Med), D.M (Neuro) పక్షవాతం (Stroke), I.C.U (24hrs), ఫిట్స్ (మూర్ఛ) తలనొప్పి, మైగ్రేన్ తలతిరుగుట, తిమ్మిర్లు, మెడ, నడుము, కండరాలు నొప్పులు, సంప్ర. సాయి నారాయణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, DBR హాస్పిటల్ వెనుక, కొర్లగుంట, తిరుపతి సెల్ : 94944 03825. AJT - 196792

హరిహర వాటర్ ప్రూఫింగ్
★ రూఫ్, స్లాబ్, ఓపెన్ టెర్రస్ బాల్కనీ, సైడ్ వాల్స్, ట్యాంక్స్, బాత్రూమ్స్, బిల్డింగ్ లీకేజీ సమస్యలను బ్రాండెడ్ కెమికల్స్‌తో ఇంజక్షన్స్ గ్రౌట్ ద్వారా 10 సం. గ్యారంటీతో చేయబడును. Ph: 8985714713 AJH-826

PLOTS FOR SALE
I, D. Thulasi Rani Spouse of late K. Neerajakshulu Naidu Rank Naik No:6378058N Resident of D. No 6-94,Rajakula colony, Pudipatla Village & Post Tirupati Rural, Tirupati Dt, ANDHRA PRADESH, INDIA have changed my name from TULSI RANI (old name) to D.THULASI RANI (NEW NAME) D. O. B 16-05-1975, That both names pertain to one and the same person AJT - 4433

RHEUMATOLOGY
డా.పి. దామోదరం, MD., DM (NIMS) రుమటాలజిస్ట్ - కీళ్లవాతం నిపుణులు, శుభోదయ రుమటాలజి సెంటర్, Opp: SBH Bank, జయనగర్, తిరుపతి. సెల్: 9391344644, 7702322499 AJT-196791

TO-LET
రేణిగుంట శ్రీకాళహస్తి రోడ్ కొత్త చెక్ పోస్ట్ వద్ద 30X70 2 అంతస్తుల భవనం వాటర్, పార్కింగ్ సౌకర్యం గల రెస్టారెంట్లకు వైన్ షాపులకు హాస్పిటల్స్ కు బాడుగకు ఇవ్వబడును. సెల్ : 97045 82084 AJT - 4333

PLOTS FOR SALE
ఏర్పేడు మండలం గుడిమల్లం, సర్వే నెంబర్ 172 పుంజా 5 ఎకరాలు సెటిల్మెంట్ భూమి అమ్మబడును. ఎకరా 16 లక్షలు కాంపౌండ్ గేట్ ఇల్లు ఉంది రోడ్డు సౌకర్యం తక్కువ. సెల్ : 97045 82084 AJT - 4332

GYNAECOLOGY
గత 19 సం॥లుగా రెడ్డి & రెడ్డి కాలనీ ఇందిరా క్లినిక్‌లో సేవలందించిన డా॥యం.మమత గారిచే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్వహించబడుతున్న హాస్పిటల్, డా. ఎం.మమత, MBBS, MD (OBG) స్త్రీల వైద్య నిపుణులు, ఇందిర హాస్పిటల్, స్త్రీ సంబంధిత వ్యాధులు, ప్రసూతి వైద్యశాల, శివశక్తి కళ్యాణమండపం దగ్గర, ప్రశాంతి నగర్, తిరుపతి. సంప్ర. : 0877-2222606, 73375 56382 AJT - 196790

పండ్ల తోట అమ్మకమునకు కలదు
తిరుపతి జిల్లా ఓజిలి మండలం ఆర్మేనుపాడు గ్రామంలో 133 ఎకరముల పండ్లతోట అమ్మకమునకు కలదు. సంప్ర: 94401 83778 AJN-193083

పాఠకులకు ముఖ్యగమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి